1
నవతెలంగాణ
మెదక్
శుక్రవారం | 02 ఫిబ్రవరి 2024 | www.navatelangana.com

బస్సులు రాక చీకట్లో విద్యార్థుల అవస్థలు

నవ తెలంగాణ మిరు దొడ్డి



ఆర్టీసీ బస్సులు సమయానికి రాకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు పడ్డ ఘటన మిరుదొడ్డి మండలంలో చోటుచేసుకుంది. మండలంలోని కాసులాబాద్, మోతే గ్రామాలకు వెళ్లాల్సిన బస్సు ప్రతిరోజు సాయంత్రం 5.30 గంటలకు మిరుదొడ్డికి రావాల్సి ఉన్నా రాత్రి 7.30 గంటలు దాటినా రాకపోవడంతో చీకట్లో విద్యార్థులు బిక్కుబిక్కుమంటూ ఉండాల్సిన పరిస్థితి నెలకొంది. మోడల్ స్కూల్ వద్ద బస్సు షెల్టర్, విద్యుత్ దీపాలు లేకపోవడంతో విద్యార్థులు భయంతో మిరుదొడ్డి నూతన బస్టాండ్ వైపు నడుచుకుంటూ వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. కొందరు విద్యార్థులు ఆటోలో ఇరువైపులా నిల్చొని ప్రయాణించారు. విద్యార్థుల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని ఆర్టీసీ అధికారులు సమయానికి బస్సులు నడపాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

పత్తి కొనుగోలు మరోసారి వాయిదా

నవతెలంగాణ- గజ్వేల్

పత్తిని ఫిబ్రవరి చివరి వరకు కొనుగోలు చేస్తామని జిల్లా మార్కెట్ శాఖ అధికారి నాగరాజు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. గురువారం వాయిదా వేస్తున్నట్లు మరో ప్రకటన విడుదల చేస్తారు. దీంతో రైతులు అయోమయానికి గురవుతున్నారు. జెన్నింగ్ మిల్లులో పత్తి నిల్వగా ఉందని కొనుగోలు చేయలేమని వారం రోజులపాటు ఆగాలని కార్యదర్శి తన ప్రకటనలో పేర్కొన్నారు. ఈనెల 6 నుండి కొనుగోలు చేస్తామని ప్రకటనలో పేర్కొన్నారు. పత్తి విక్రయించుకున్నందుకు రైతులు మార్కెట్ రావడానికి సిద్ధమవుతున్న సమయంలో అధికారులు మరో నిర్ణయం తీసుకున్న పట్ల అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.



పెళ్లి సంబంధం చూడటానికి వెళ్తూ అనంతలోకాలకు

- మహీంద్రా జీతో గూడ్స్ వాహనం టైరు పగిలి డివైడర్‌కు ఢీ
- ఇద్దరు మృతి.. 8 మందికి గాయాలు



నవతెలంగాణ - చిన్నకోడూరు

కూతురు పెళ్లి సంబంధం చూడటానికి వెళ్తూ వాహనం టైర్ పగిలి అతివేగంగా డివైడర్ ఢీకొనడంతో ఇద్దరు మృతి చెందారు. మరో 8మందికి గాయాలైన సంఘటన చిన్నకోడూరు మండలం రామునిపట్ల గ్రామ శివారులో రాజీవ్ రహదారిపై గురువారం చోటు చేసుకుంది. ఏసీపీ సిద్దిపేట సురేందర్ రెడ్డి కథనం ప్రకారం... మిరియాల శ్రీనివాస్ యొక్క కూతురికి సంబంధం చూడడానికి కరీంనగర్ పట్టణానికి హైదరాబాద్ నుండి మహీంద్రా జీతో గూడ్స్ వాహనంలో శ్రీనివాసు, అతని కొడుకు హన్మంతరావు, అతని భార్య, పదిమంది గూడ్స్ వాహనంలో వస్తున్నారు. రామునిపట్ల గ్రామ శివారులోకి రాగానే వాహనం ఎడమవైపు వెనుక భాగాన టైరు పగిలి డివైడర్ కు ఢీ కొట్టడంతో వాహనం ఉల్టా తిరిగి వాహనంలో ఉన్న వ్యక్తులపై బోల్తాపడింది. మిరియాల శ్రీనివాసు, అతని కొడుకు హనుమంతరావుకు బలమైన గాయాలు తగిలి అక్కడికక్కడే మృతి చెందారు. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం సిద్దిపేట ఏరియా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మిరియాల విజయ ఫిర్యాదుతో మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనే లక్ష్యం

సీపీ డాక్టర్ బి. అనురాధ
నవ తెలంగాణ సిద్దిపేట అర్బన్

బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ పాటుపడాలని, ఆపరేషన్ స్మైల్ లో భాగంగా 85 మందిని రెస్క్యూ చేసి తల్లిదండ్రులకు అప్పగించినట్లు సిద్దిపేట సీపీ డాక్టర్ బి.అనురాధ తెలిపారు. గురువారం ఆమె మాట్లాడుతూ జనవరి 1 నుండి 31వరకు నిర్వహించిన ఆపరేషన్ స్మైల్-టెన్‌లో వివిధ డిపార్ట్మెంటు అధికారులు, సిబ్బందితో నెల రోజుల పాటు రిస్క్యూ ఆపరేషన్ చేయడం జరిగిందని తెలిపారు. ఈ రిస్క్యూ ఆపరేషన్ లో పనిలో ఉన్న 71 మంది మగవారు, 14 మంది ఆడపిల్లలను గుర్తించి వారి తల్లిదండ్రులకు, బంధువులకు అప్పగించినట్లు తెలిపారు. బాల కార్మికులతో పనిచేయించుకుంటున్న యజమానులపై జిల్లాలో 9 కేసులు నమోదు చేయడం జరిగిందని, సంబంధిత షాపు యజమానులపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఆపరేషన్ స్మైల్ ను విజయవంతం చేసిన నోడల్ అధికారి అడిషనల్ డీసీపీ ఎస్. మల్లారెడ్డి, వివిధ డిపార్ట్మెంట్ అధికారులను, సిబ్బందిని ఆమె అభినందించారు. సంవత్సరం పొడవునా ఏ రోజైనా ఎప్పుడైనా ఎక్కడైనా బాల కార్మికులతో పనిచేయించినట్లు కనబడితే వెంటనే డయల్ 100, సిద్దిపేట పోలీస్ కమిషనరేట్ కంట్రోల్ రూమ్ నెంబర్ 8712667100 సమాచారం అందించాలని సూచించారు. సమాచార అందించిన వారి పేర్లు గోప్యంగా ఉంచుతామని తెలిపారు.

అధ్వానంగా మధ్యాహ్న భోజనం

- వారంలో ఒకటి లేదా రెండు సార్లు మాత్రమే గుడ్డు
- ఇంటి నుంచి బాక్సులు తెచ్చుకుంటున్న విద్యార్థులు
- ఇదీ కుకునూరుపల్లి ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనం తీరు





నవ తెలంగాణ - కొండపాక

సంపూర్ణ పోషకాహారం అందించాలని ప్రభుత్వం అమలు చేస్తున్న మధ్యాహ్న భోజనం పలు పాఠశాలలో అధ్వానంగా నిర్వహిస్తున్నారు. దీంతో విద్యార్థులు అర్ధాకలితోనే చదువులు సాగిస్తున్నారు. కుకునూరు పల్లి ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనం అద్వానంగా ఉందని విద్యార్థులు పేర్కొన్నారు. పాఠశాలను సందర్శించగా పలు విషయాలు వెలుగులోకి వచ్చాయి. పాఠశాలలో 390 మంది విద్యార్థులు ఉండగా సుమారు 20 నుంచి 50 మంది విద్యార్థులు ఇంటి నుంచే బాక్సులు తెచ్చుకొని తింటున్నారు. పాఠశాలలో తినే విద్యార్థులు సరిగా లేని రోజు అన్నం పడేస్తున్నట్లు విద్యార్థులు తెలిపారు. అలాగే మెనూ ప్రకారం వారంలో మూడు రోజులు గుడ్డు పెట్టాల్సి ఉండగా వారంలో ఒకటి లేదా రెండు మాత్రమే పెడుతున్నారని తెలిపారు. మధ్యాహ్న భోజనంలో కూరలు చారు సరిగా ఉండవని పేర్కొన్నారు. ఆరు నెలల నుంచి బిల్లులు సరిగా రావడం లేదని నిర్వాహకులు చెబుతున్నారు. ఈ విషయంలో ప్రధానోపాధ్యాయుడు సత్తయ్యను వివరణ కోరగా అలాంటిది ఏమీ లేదని, మెనూ ప్రకారం మధ్యాహ్నం భోజనం నిర్వహిస్తున్నామని తెలిపారు. కొంతమంది విద్యార్థులు ఆహారం పడకపోవడంతో ఇంటి నుంచి బాక్సులు తెచ్చుకుంటున్న విషయం నిజమేనని తెలిపారు.

ఒక్క సీసీ కెమెరా వందమంది పోలీసులతో సమానం



నవతెలంగాణ-చేర్యాల

ఒక్క సీసీ కెమెరా వందమంది పోలీసులతో సమానమని చేర్యాల సీఐ ఎల్.శ్రీను తెలిపారు. చేర్యాల పోలీస్ స్టేషన్ పరిధిలోని ఆకునూరు గ్రామంలో గురువారం గ్రామ ప్రజలకు, వ్యాపారస్తులకు, ప్రజాప్రతినిధులకు సీసీ కెమెరాలు ఏర్పాటు వల్ల కలిగే ఉపయోగాల గూర్చి సీఐ అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో పరిసర ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన కొన్ని సీసీ కెమెరాలు పని చేయడం లేదని, రిపేర్ చేయడానికి, కొత్త సీసీ కెమెరాల ఏర్పాటుకు గ్రామ ప్రజలు, ప్రజాప్రతినిధులు, వ్యాపారస్తులు, ప్రముఖులు సహకరించాలని సూచించారు. ప్రజలకు మెరుగైన సేవల కోసం సీసీ కెమెరాలు ఎంతగానో దోహదపడతాయని అన్నారు. అమాయకులను చట్టం నుండి రక్షించడానికి సీసీ కెమెరాలు బాగా ఉపయోగపడతాయని, సీసీ కెమెరాల ఫుటేజ్ వల్ల కోర్టులో నిందితులకు తప్పకుండా శిక్ష పడుతుందని తెలిపారు. సీసీ కెమెరాలు 24 గంటలు 365 రోజులు నిర్విరామంగా నిరంతరాయంగా పనిచేస్తాయని పేర్కొన్నారు.గ్రామంలో గంజాయి, ఇతర మత్తు పదార్థాలు అమ్మకుండా గ్రామస్తులు చూడాలని కోరారు. మత్తు పదార్థాలు అమ్మే వారు ఎవరైనా ఉంటే వెంటనే సంబంధిత పోలీస్ స్టేషన్ కు సమాచారం అందించాలని సూచించారు. ఎస్ఐ దామోదర్, ఆకునూరు మాజీ సర్పంచ్ చీపురు రేఖ,మాజీ ఉప సర్పంచ్ బోయిని పద్మ, ఎంపీటీసీ లు సుంకరి శ్రీధర్ గౌడ్,తౌట సుధారాణి, పిఎసి ఎస్ డైరెక్టర్ కొమ్ము రవి పాల్గొన్నారు.

రైతులే దేశానికి యజమానులు



నవ తెలంగాణ- దుబ్బాక

అన్నం పెట్టే రైతులే దేశానికి యజమానులని, మిగతా వారంతా సేవకులు మాత్రమేనని భారతీయ కిసాన్ సంఘ్ రాష్ట్ర సంఘటన మంత్రి దోనూరి రాము అన్నారు. వ్యవసాయం అనేది పాపపు పని కాదని, భూమిని అమ్మ వద్దని నమ్ముకోవాలని రైతులకు విజ్ఞప్తి చేశారు.గురువారం దుబ్బాక పురపాలిక కేంద్రంలోని రెడ్డి ఫంక్షన్ హాల్లో భారతీయ కిసాన్ సంఘ్ ఆధ్వర్యంలో నిర్వహించిన రైతుల సభ్యత్వ నమోదు కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు.ప్రతి ఏటా విద్యా సంస్థలు, కార్పొరేట్ ఆసుపత్రుల్లో ఫీజుల ధరలు పెరుగుతున్నాయని, పంటల ధరలు ,ఆహార పదార్థాల ధరలు క్షీణిస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు.ఉద్యోగుల జీతాలు,కూలి రేట్లు నానాటికి పెరుగుతున్నా రైతులు పండించిన పంటలకు మద్దతు ధర లభించడం లేదన్నారు. వ్యవసాయ పనిముట్లు,వ్యవసాయ వాహనాల ధరలు, ఎరువులు, విత్తనాలు ధరలు అమాంతం పెరుగుతున్నాయని రైతులకు అన్నింట అన్యాయమే జరుగుతుందని మండిపడ్డారు. రైతుల పక్షాన ఉండి వారి సమస్యలపై పోరాటం చేసేందుకు తమ సంఘం కృషి చేస్తుందని స్పష్టం చేశారు.జిల్లా అధ్యక్షుడు కూరెల్లి జస్వంత్ రెడ్డి, గౌరవాధ్యక్షుడు తోర్నాల దుర్గారెడ్డి, కార్యదర్శి కామిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి, రెవిన్యూ ప్రముఖ్ గూడ మహేందర్ రెడ్డి, మహిళా ప్రముఖ్ నిర్మల, జిల్లా ఉపాధి కల్పన ప్రముఖ్ తిరుమల్ రెడ్డి,సేంద్రియ ప్రముఖ్ రాజిరెడ్డి,విద్యుత్ ప్రముఖ్ సత్యనారాయణ రెడ్డి,నాయకులు గాడిపల్లి అరుణ రెడ్డి,దుబ్బాక మండల కన్వీనర్ డాకూరి రాజిరెడ్డి పాల్గొన్నారు.

అంకెల గారడీ

- ఇంటింటికీ ఉపాధి, విద్యుత్, తాగునీరు ఉత్తమాటే
- అరకొరగా ఇళ్ల నిర్మాణం
- రైల్వే లైన్ల నిర్మాణానికి మోక్షంలేదు
- కేంద్రీయ, నవోదయ విద్యాలయాలు రాలే
- నిమ్జ్ ప్రాజెక్టుకు నిధుల కేటాయింపు పట్టదు
- బడా పారిశ్రామిక వేత్తలకే మేలు

నవతెలంగాణ-మెదక్ ప్రాంతీయ ప్రతినిధి

కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలాసీతారామన్ బడ్జెట్‌లో అంకెల గారడీ తప్ప ప్రజలకు మేలు చేకూరే అంశాలేవి లేవనే చెప్పాలి. ఎన్నికల వేళ మధ్యంతర బడ్జెట్‌ను ఆమె గురువారం పార్లమెంట్‌లో ప్రవేశపెట్టారు. నరేంద్రమోడీ పథకాలను ఏకరువు పెట్టడం తప్ప కొత్తగా ప్రయోజనం చేకూర్చే పథకాలేవీ ప్రస్తావించలేదు. వికసిత్ భారత్, నిర్మల్ భారత్ పదాల చుట్టు దేశ అభివృద్ధి, ప్రజల సంక్షేమాన్ని తిప్పడం తప్ప వాస్తవ పరిస్థితుల్ని చెప్పలేని బలహీనత కనిపించింది. పార్లమెంట్ ఎన్నికల జరగనున్న వేళ ప్రజలకు కొత్త సంక్షేమ పథకాలు, వేతన జీవులకు ఆదాయ పన్ను రాయితీలు, నిరుద్యోగులు, గ్రామీణ యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాల కల్పన, ఇంటింటికీ తాగునీరు, విద్యుత్ సదుపాయం, రైల్వే లైన్ల నిర్మాణానికి నిధులు, నవోదయ, కేంద్రీయ విద్యాలయాల మంజూరు, ఉపాధి నిధుల ఖర్చు, ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్, ఇళ్ల నిర్మాణం వంటి అంశాల్లో పదేళ్లల్లో జరిగిన వైఫల్యాలను కప్పిపుచ్చుకునే ప్రయత్నం చేశారు. ఉమ్మడి మెదక్ జిల్లాకు ఏలాంటి మేలు చేకూరిన పరిస్థితి లేదు.

పట్టాలెక్కని రైల్వే లైన్లు

కేంద్ర బడ్జెట్‌పై ప్రజలు పెట్టుకున్న ఆశలు నిరాశలయ్యాయి. ముఖ్యంగా రైల్వే లైన్ల నిర్మాణం విషయంలో ఉమ్మడి మెదక్ జిల్లాకు అన్యాయం జరిగింది. జరుగుతున్న పారిశ్రామిక అభివృద్ధికి తోడుగా రవాణా మార్గాల అభివృద్ధి లేకపోవడంతో సంగారెడ్డి, మెదక్, సిద్దిపేట ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. 22 సంవత్సరాలుగా కొత్త రైల్లే లైన్ల నిర్మాణం కోసం స్థానిక ప్రజలు పోరాడుతున్నారు. ముఖ్యంగా సంగారెడ్డి-జోగిపేట మీదుగా మెదక్ వరకు 90 కిలో మీటర్ల మేర రైల్వే లైన్ నిర్మించాలని స్థానికులు ఎప్పటి నుంచో పోరాడుతున్నారు. 2018లో రైల్వే లైన్ నిర్మాణం కోసం సర్వే కూడా నిర్వహించారు. ఈ బడ్జెట్‌లో నిధులు కేటాయిస్తారనుకుంటే మొండిచెయ్యి చూపారు. సదాశివపేట, సంగారెడ్డి, నారాయణఖేడ్, జోగిపేట నుంచి నిత్యం హైదరాబాద్‌కు వేలాది మంది ప్రయాణిస్తున్నారు. వీరందరికీ రైల్వే లైన్ విస్తరిస్తే రవాణా సదుపాయం కల్గుతుంది. పారిశ్రామిక ప్రాంతమైనందున ఇక్కడ తయారయ్యే ఉత్పత్తులు ఎక్స్‌పోర్ట్ చేసేందుకు కూడా వీలవ్వుది. వట్టినాగులపల్లి నుంచి అదిలాబాద్ వరకు కూడా రైల్వే లైన్ విస్తరించాల్సి ఉన్నా కేంద్రం పట్టించుకోలేదు. సికింద్రాబాద్ నుంచి సిద్దిపేటకు గతేడాది అక్టోబర్ నుంచి రైల్ నడుస్తుంది. విద్యుదీకరణ లేకపోవడం వల్ల ఎక్స్‌ప్రెస్ రైళ్లు నడుస్తలేవు. విద్యుదీకరణ చేయాలని స్థానికులు కోరుతున్నారు. మెదక్ నుంచి సికింద్రాబాద్‌కు రోజుకు రెండు సార్లు మాత్రమే రైలు నడుస్తుంది. తిరుపతి, షిర్డీకి కూడా రైళ్లు నడపాలని కోరుతున్నారు. మెదక్-చేగుంట ప్రధాన రహదారి చేగుంటలో రైల్వే గేట్ లేని కారణంగా నిత్యం ప్రయాణికులు గంటల తరబడి ఇబ్బందులు పడాల్సి వస్తుంది. ఫ్లైఓవర్ బ్రిడ్జ్ నిర్మాణం కోసం కృషి చేస్తానని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి హామి ఇచ్చినా పట్టించుకోవట్లేదు.

నవోదయ, కేంద్రీయ విద్యాలయాల్లేవు



ప్రతి జిల్లాకో నవోదయ పాఠశాల, పార్లమెంట్ నియోజకవర్గానికో కేంద్రీయ విద్యాలయం ఏర్పాటు చేయాల్సి ఉన్నా కేంద్రం నుంచి మంజూరు కాలేదు. మెదక్ జిల్లాలో కేంద్రీయ, నవోదయ విద్యాలయాల్ని మంజూరు చేయాలని మాజీ ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి అనేక సార్లు పార్లమెంట్‌లో ప్రస్తావించారు. ఈ బడ్జెట్‌లోనైనా ఉమ్మడి మెదక్ జిల్లాకు నవోదయ, కేంద్రీయ విద్యాలయాలు మంజూరవుతాయని ఆశించినా ఫలితం దక్కలేదు.

నిమ్జ్ ప్రాజెక్టు పట్టని కేంద్రం

జహీరాబాద్ ప్రాంతంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యంలో ఏర్పాటు చేసిన నిమ్జ్‌కు కేంద్రం నుంచి నిధులు అందట్లేదు. రాష్ట్ర ప్రభుత్వం భూముల్ని కేటాయించి ఆయా సంస్థలుకు కేటాయింపులు చేసింది. నిమ్జ్‌ను మరింత అభివృద్ధి చేసేందుకు కేంద్రం నుంచి రూ.1500 కోట్ల మేరకు నిధులు ఇవ్వాలని గతంలో ప్రభుత్వం తరపున అనేక సార్లు లేఖలు రాశారు. మంత్రుల్ని కలిసి విన్నవించారు. కేంద్రం నుంచి నిధులివ్వకపోవడం వల్ల నిమ్జ్ ప్రాజెక్టు లక్ష్యానికి ఆమడ దూరంలోనే ఉండిపోతుంది.

ఇంటింటికీ ఉపాధి, తాగునీరు ఉత్తమాటే

బడ్జెట్‌లో మంత్రి నిర్మలాసీతారామన్ ప్రస్తావించిన విషయాలన్నీ అబద్దాలుగా ఉన్నాయి. ప్రతి ఇంటికీ ఉపాధి, తాగునీరు, విద్యుత్ కల్పించాలని ఆమె చెప్పారు. ఉమ్మడి మెదక్ జిల్లాలో ఇంటింటికీ రక్షిత మంచినీరు అందించిన మిషన్ భగీరథ పథకానికి కేంద్రం నుంచి నిధులివ్వకుండా ఆపింది. రాష్ట్ర ప్రభుత్వం నీళ్లు ఇస్తే కేంద్రం తాము ఇచ్చినట్లుగా లెక్కలు చెబుతోంది. ఏటా రెండు కోట్ల ఉద్యోగాలిస్తామని చెప్పిన మోడీ ప్రభుత్వ సంస్థల్ని అమ్మేస్తూ ఉద్యోగాల భర్తీనే ఆపేశాడు. ఉమ్మడి మెదక్ జిల్లాలో కొత్తగా కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాలు వచ్చింది లేదు. పైగా ఈ ప్రాంతంలో ఉన్న బీహెచ్‌ఈఎల్, ఓడీఎఫ్ వంటి ప్రభుత్వ రంగ సంస్థల్ని అమ్మజూపుతున్నారు. దీంతో ఉన్న ఉద్యోగాలు ఊడిపోతున్నాయని ఉద్యోగులు ఆందోళన చెందుతున్నారు. ఇక విద్యుత్ సదుపాయం కూడా అంతంత మాత్రమనే చెప్పాలి. రెండు కోట్ల ఇళ్లు నిర్మించి ఇస్తామని చెప్పడం తప్ప చేసిందిలేదు. రాష్ట్ర ప్రభుత్వం నిర్మించిన డబుల్ బెడ్‌రూం ఇళ్లు తప్ప కేంద్రం నుంచి నేరుగా ఇళ్లులేని పేదలకు ఇళ్లను కట్టించిందిలేదు.

పేదలకు మొండిచెయ్యి... పెద్దలకు వరాలు

గొల్లపల్లి జయరాజు, సీపీఐఎం జిల్లా కార్యదర్శి



కేంద్ర ఆర్థిక మంత్రి ప్రవేశపెట్టిన బడ్జెట్ తీరు చూస్తే పేదలకు మొండిచెయ్యి... పెద్దలకు మాత్రం వరాలన్నట్లుగా ఉంది. 47 లక్షల కోట్లతో పెట్టిన బడ్జెట్ అంకెల గారడీగా ఉంది. సంపన్నులకు వరాలిచ్చిన ప్రభుత్వం పేదలపై మా త్రం భారాలు మోపింది. ఎరువులు, ఆహార సబ్సిడీలను ఎత్తి వేసే విధంగా ఉంది. ఉపాధి హామీకి నిధుల్ని కోత పెట్టింది. సంగారెడ్డి జిల్లాలో కొత్త రైల్వే ప్రాజెక్టులన్నీ పెండింగ్‌లోనే ఉ న్నాయి. మెట్రో లైన్ పొడగింపుకు కేంద్రం నిధులివ్వట్లేదు. న వోదయ, కేంద్రీయ, ఐఐటీ లాంటి కేంద్ర విద్యా సంస్థలను మంజూరు చేసే విషయంలోనూ కేంద్రం వివక్ష చూపుతుం ది. రైతులకు ఇవ్వాల్సిన సబ్సిడీలను కోత పెట్టింది.

దళితుల్ని విస్మరించిన కేంద్ర బడ్జెట్

అతిమేల మాణిక్యం, కేవీపీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు



కేంద్ర బడ్జెట్‌లో దళితుల సంక్షేమం, అభివృద్ధిని విస్మరించారు. దళితుల కోసం బడ్జెట్ కేటాయింపుల్లో అంకెల్లో పెరుగుదల తప్ప ఖర్చు చేసే విషయంలో ఉండట్లేదు. గత బడ్జెట్‌లో కేటాయించిన నిధుల్ని 40 శాతం కూడా ఖర్చు చేయలేదు. 102 శాఖల ద్వారా ఖర్చు పెడుతున్న ప్రభుత్వం దళితుల్ని మోసం చేస్తుంది. దళితుల ప్రత్యక్ష ప్రయోజనాల కోసం సబ్‌ప్లాన్ నిధుల్ని ఖర్చు చేయాల్సి ఉన్నా పట్టించుకోవట్లేదు. నోడల్ అధికారి ద్వారా నిధుల్ని ఖర్చు చేయాలి. ప్రధాని ఆవాజ్ యోజన కింద పేదలకు ఇళ్లు నిర్మించే విషయంలోనూ అంకెల గారడీ కనిపిస్తుంది. దళితులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించే విషయంలోనూ నిర్లక్షం చేస్తుంది.

గద్దర్ ఆలోచనలకు అనుగుణంగానే ప్రజాపాలన

- అధికారికంగా గద్దర్ జయంతి
- ధరణి స్థానంలో కొత్త రెవెన్యూ విధానం
- డిప్యూటీ సీఎం మల్లు బట్టివిక్రమార్క
- తెల్లాపూర్‌లో గద్దర్ విగ్రహం ఆవిష్కరణ

నవతెలంగాణ రామచంద్రాపురం



ప్రజా యుద్ధనౌక, దివంగత గద్దర్ ఆలోచనలకు అనుగుణంగానే కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజాపాలన కొనసాగిస్తోందని తెలంగాణ రాష్ట్ర డిప్యూటీ సీఎం మల్లు బట్టి విక్రమార్క వెల్లడించారు. దివంగత గద్దర్ జయంతిని ఇక నుండి అధికారికంగా నిర్వహిస్తామన్నారు. బుధవారం రాత్రి సంగారెడ్డి జిల్లా రామచంద్రాపురం మండలం తెల్లాపూర్‌లో గద్దర్ గళం వ్యవస్థాపకులు కొల్లూరి సత్తయ్య, స్వతంత్ర కౌన్సిలర్ కొల్లూరి భరత్ ఆధ్వర్యంలో గద్దర్ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గద్దర్ విగ్రహాన్ని ఎక్సైజ్, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావుతో కలిసి డిప్యూటీ సీఎం బట్టి విక్రమార్క ఆవిష్కరించారు. అనంతరం పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం బట్టి విక్రమార్క మాట్లాడుతూ... ప్రతి ఏడాది ఆయన జయంతిని ఘనంగా నిర్వహిస్తామని చెప్పారు. ఇందిరమ్మ రాజ్యం తీసుకురావడానికి ప్రోత్సహించిన వ్యక్తి గద్దర్ అని గుర్తు చేశారు. ఆయన ఆలోచనలను, ఆశయాలను అమలు చేసేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. ఆయన ఆశయ సాధన కోసం ప్రతి ఒక్కరు కృషి చేయాలన్నారు. గద్దర్ తో తనకున్న అనుబంధాన్ని గుర్తు చేశారు. తెల్లాపూర్ సర్కిల్లో దివంగత గద్దర్ విగ్రహం వద్ద గద్దర్ స్మృతి వనం ఏర్పాటు చేయాలని కోరుతున్నారని, తప్పకుండా కాంగ్రెస్ ప్రభుత్వం, తన వంతు సహాయ సహకారాలు ఎల్లవేళలా ఉంటాయని భరోసానిచ్చారు.

ధరణి స్థానంలో కొత్త రెవెన్యూ విధానం

ధరణిని తొలగించి ఆ స్థానంలో కొత్త రెవెన్యూ విధానం తీసుకువస్తామని డిప్యూటీ సీఎం బట్టి విక్రమార్క ప్రకటించారు. దీనిపై చాలా లోతైన ఆలోచన చేయడం జరిగిందని అన్నారు. కానీ గత బిఆర్ఎస్ ప్రభుత్వం తరతరాల నుంచి వస్తున్న భూములను, భూస్వాములకు అప్పజెప్పాలని ధరణి పోర్టల్ ను తీసుకువచ్చారని విమర్శించారు. దీనితో అనేకమంది ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. అయితే ప్రత్యేక రాష్ట్రం సాధించుకున్న, అది కొద్ది మంది చేతుల్లో రాష్ట్రం బంది అయిందన్నారు. తన స్వేచ్ఛను కోల్పోయిందన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో కంటే ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన తర్వాత వనరులు, సంపద దోపిడీకి గురైందని తెలిపారు.

గత ప్రభుత్వం గద్దర్‌పై కేసులు ఎత్తివేయలేదు

- ఎక్సైజ్, పర్యటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు

గత ప్రభుత్వం దివంగత గద్దర్ పైన కేసులు ఎత్తివేయలేదని ఎక్సైజ్, పర్యటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. తెలంగాణ ఉద్యమ కేసులను కేసీఆర్, కేటీఆర్ ఎత్తి వేసుకున్నారని, కానీ గద్దర్ చనిపోయే వరకు కేసులు అలాగే ఉన్నాయని చెప్పారు. గద్దర్ పైన ఉన్న కేసులను ఎత్తివేయకుండా, అతనిని ఇబ్బందులు పెట్టారని తెలిపారు. గద్దర్ శరీరంలో ఒక బుల్లెట్ చివరిదాకా ఉందన్నారు. గద్దర్ కు శీలం, కరుణ, జ్ఞానం, ఆచరణ ఈ నాలుగు ఉండేవని గుర్తు చేశారు. అందుకే ఆయన గొప్ప వ్యక్తి అయ్యారని అన్నారు. గద్దర్ గళం విప్పితే శత్రువులు గడగడ వణికి పోయేవారని అన్నారు. గద్దర్ ఆశయాలను నెరవేర్చేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్.ఎస్ ప్రవీణ్ కుమార్, ప్రొఫెసర్ కంచె ఐలయ్య, మాజీ ఎంపీ మధు యాష్కి గౌడ్, గద్దర్ కుమారుడు సూర్యం, కుమార్తె వెన్నెల, గాదె ఇన్నయ్య, సీనియర్ జర్నలిస్టు పాశం యాదగిరి, పటాన్ చెరు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కాట శ్రీనివాస్ గౌడ్, తెల్లాపూర్ మున్సిపల్ చైర్మన్ మల్లేపల్లి లలితా సోమిరెడ్డి, స్థానిక నేతలు పాల్గొన్నారు.

స్పేస్ టెక్ ఇండస్ట్రీలో అపార అవకాశాలు

ఇస్రో శాస్త్రవేత్త డాక్టర్ శేషగిరిరావు
నవతెలంగాణ - పటాన్‌చెరు



అంతరిక్ష పరిశోధనలు విస్తరిస్తున్న కొద్దీ ఆ రంగంలో అవకాశాలు అపారంగా పెరుగుతున్నాయని, తగిన సాంకేతిక పరిజ్ఞానంతో వాటిని అందిపుచ్చుకోవాలని ప్రఖ్యాత ఇస్రో శాస్త్రవేత్త డాక్టర్ శేషగిరిరావు వెల్లంకి సూచించారు. గీతం స్కూల్ ఆఫ్ టెక్నాలజీలోని మెకానికల్ ఇంజనీరింగ్ విభాగం ఆధ్వర్యంలో 'స్పేస్టెక్ పరిశ్రమలో వినూత్న ధోరణులు' అనే అంశంపై గురువారం ఆయన ఆతిథ్య ఉపన్యాసం చేశారు. అంతరిక్ష సాంకేతిక పరిశ్రమలో వృద్ధికి విస్తారమైన పరిధి, సంభావ్యతల గురించి ఆయన విడమరచి చెప్పారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 20వ దశకం ప్రారంభంలో 'న్యూ స్పేస్' అనే పదం ఉద్భవించిందని, ఇది వాణిజ్య కార్యకలాపాలు, సాంప్రదాయ అంతరిక్ష కార్యకలాపాలు, ఆయా రంగాల బాధ్యతల నుంచి నేరు చేయడం లక్ష్యంగా పెట్టుకుందన్నారు. పేలోడ్లు / ఉపగ్రహాలు, లాంచర్లు/ల్యాండర్లు, స్పేస్ సెగ్మెంట్లలో నివాసం/రవాణాతో సహా స్పేస్ టెక్ పరిశ్రమలోని కీలకమైన ఆవిష్కరణ ప్రాంతాలను డాక్టర్ రావు ప్రస్తావించారు. భారతదేశ స్పేస్ టెక్ మార్కెట్ 2023 నుంచి 2030 వరకు సగటు వార్షిక వృద్ధి రేటు 26 శాతంగా ఉంటుందని, 77 బిలియన్ డాలర్లకు పెరుగుతుందని ప్రొఫెసర్ శేషగిరి అంచనా వేశారు. 2022 నాటికి ఎనిమిది బిలియన్ డాలర్ల పెట్టుబడితో దాదాపు 204 స్పేస్ స్టార్టప్లు పనిచేస్తూ, గణనీయమైన వృద్ధిని సాధిస్తున్నట్లు చెప్పారు.ఉపగ్రహ పరిశ్రమలో చిన్న ఉపగ్రహాలు, శాటిలైట్ ఐవోటీ, అడ్వాన్స్డ్ గ్రౌండ్ సిస్టమ్స్, కృత్రిము మేధ, స్పేస్ క్రాఫ్ట్ ప్రొపల్షన్ వంటి సాంకేతిక పోకడలు మరిన్ని స్టార్టప్లను ఆకర్షిస్తుందని డాక్టర్ రావు చెప్పారు. అధునాతన ఉపగ్రహాలు, తదుపరి తరం ఉపగ్రహ సమాచార వ్యవస్థ, అంతరిక్ష పర్యాటకం, వాణిజ్య ఉపగ్రహ ప్రయోగాలతో సహా భవిష్యత్తు ధోరణులు, అందివచ్చే అవకాశాలను ఆయన వివరించారు.వేగంగా అభివృద్ధి చెందుతున్న స్పేస్ టెక్ పరిశ్రమపై విలువైన అంతర్దృష్టులను ఆయన అందించడమే గాక, ఆవిష్కరణలు, వాణిజ్య అవకాశాలను ఏకరువు పెట్టారు. ఈ సందర్భంగా అతిథిని ఘనంగా సన్మానించారు.

కాల్వల ద్వారా సాగునీరు అందించాలి

నవతెలంగాణ-మద్దూరు



లద్నూర్ రిజర్వాయర్ కాల్వ ద్వారా రైతులకు సాగునీరు అందించాలని కోరుతూ మండలంలోని ధర్మారం గ్రామ రైతులు గురువారం ఆందోళన చేశారు. ఈ సందర్భంగా మండలంలోని ధర్మారం గ్రామానికి చెందిన రైతులు మాట్లాడుతూ రిజర్వాయర్ కాల్వను నమ్ముకొని వందల ఎకరాల వరి పంట సాగు చేశామని వారన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు కాల్వనిండా పంట పొలాలకు సాగునీరు అందించేదని వారన్నారు.కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే కాల్వలో నీళ్ల ఆగిపోయాయని వారు ఆవేదన వ్యక్తం చేశారు. రిజర్వాయర్ కాలువ ద్వారా సాగునీరు ను నమ్ముకొని వరి నాట్లు వేశామని రైతులు తెలిపారు. ప్రభుత్వం రైతుల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని వెంటనే రిజర్వాయర్ కాలువలోకి సాగునీరు విడుదల చేయాలని డిమాండ్ చేశారు

కార్మిక వ్యతిరేక మోడీని గద్దె దించుదాం

సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు జే.మల్లికార్జున్
నవ తెలంగాణ-కొండాపూర్



కార్మిక వ్యతిరేక ప్రధానమంత్రి మోడీని గద్దె దించుదామని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు జే.మల్లికార్జున్ అన్నారు. కొండాపూర్ మండలంలోని మల్లేపల్లి గ్రామ పరిధిలోగల యుబి గోల్కొండ పరిశ్రమలో యూనియన్ జనరల్ బాడీ సమావేశం జరిగింది. అనంతరం కేంద్ర ప్రభుత్వ కార్మిక విధానాలను వ్యతిరేకిస్తూ సంతకాలు సేకరించారు. ఈ సమావేశంలో మల్లికార్జున్ మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వ కార్మిక కర్షక ప్రజావ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా ఫిబ్రవరి 16న జరిగే సమ్మెను జిల్లాలో ప్రతి పారిశ్రామిక ప్రాంతం బంద్ చేసి కార్మిక వ్యతిరేక మోడీకి గుణపాఠం చెప్పాలని మోడీని గద్దె దించితే తప్ప కార్మిక హక్కుల్ని కాపాడుకోలేమని అన్నారు. బిజెపి ప్రభుత్వం వచ్చిన పది సంవత్సరాల కాలంలో పూర్తిగా కార్మికుల హక్కుల మీద దాడి చేస్తూ పెట్టుబడిదారులకు అనుకూలంగా నిర్ణయాలు చేస్తుందన్నారు. పోరాడి సాధించుకున్న హక్కులను గురించి చట్టాలను గురించి నాలుగు లేబర్ కోడులను తెచ్చి పెట్టుబడిదారుల కనుకూలంగా నిర్ణయాలు చేసి కార్మికులను అన్యాయం చేసిన కేంద్ర ప్రభుత్వానికి ప్రతి కార్మికుడు గుణపాఠం చెప్పాలని పిలుపునిచ్చారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం నల్ల చట్టాలను తెచ్చి రైతులకు మోసం చేసిందని ఉపాధి హామీ చట్టాన్ని కూలీలకు దూరం చేస్తుందని కేంద్ర ప్రభుత్వానికి కార్మికులు రైతులు కూలీలు తగిన గుణపాఠం చెప్పే రోజులు దగ్గరలోనే ఉన్నాయని అన్నారు ఫిబ్రవరి 16న జరిగే సమ్మె గ్రామీణ బంద్ లో కార్మికులు రైతులు కూలీలు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని కోరారు ఈ కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షులు సిఐటియు జిల్లా అధ్యక్షులు మీ మల్లేష్ జిల్లా కార్యదర్శి జి సాయిలు, యూనియన్ కార్యదర్శి రాందాస్, యూనియన్ నాయకులు కొండల్ రెడ్డి వేణు పాండు వీరయ్య అర్జున్ రెడ్డి వేణు రెడ్డి రమేష్, కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమాన్ని గాలికి వదిలేసిన బడ్జెట్

సీపీఎం జిల్లా కార్యదర్శి ఆముదాల మల్లారెడ్డి
నవ తెలంగాణ సిద్దిపేట అర్బన్



ప్రజా సంక్షేమాన్ని కేంద్రంలోని నరేంద్ర మోడీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ పూర్తిగా విస్మరించిందని కేంద్ర బడ్జెట్‌పై సీపీఎం జిల్లా కార్యదర్శి ఆముదాల మల్లారెడ్డి అన్నారు. 2047 నాటికి సామాజిక ఆర్థిక అసమానతలను పూర్తిగా నిర్మూలిస్తామని, సంవత్సరానికి రెండు కోట్ల ఇండ్లను ప్రధానమంత్రి ఆవాస్ యోజన కింద నిర్మించి పేదలకు ఇస్తామని పార్లమెంట్లో నిర్మల సీతారామన్ చేసిన ప్రకటన ఆస్యాస్పదంగా ఉందన్నారు. కార్పొరేట్ సంస్థలకు రాయితీలను ప్రతిపాదించిన సీతారామన్ రైతులను, వ్యవసాయ రంగాన్ని విస్మరించిందన్నారు. ఉపాది హామీ పథకాన్ని నిర్వీర్యం చేసే విధంగా బడ్జెట్లో కేటాయింపులు జరపలేదని, పేదల పెన్షన్లు రేషన్ షాపుల కిచ్చే సబ్సిడీ ఆహార ధాన్యాలను తగ్గించడం సిగ్గుచేటని అన్నారు. పెరుగుతున్న ధరలను నియంత్రణ చేయకుండా పేదలపై మరింత ధరల భారాన్ని మోపే విధంగా బడ్జెట్ ఉందని అన్నారు.పెరిగే ధరల కనుగుణంగా కార్మికుల కనీస వేతనాలను రివైజ్ చేసి పెంచకుండా ఏ విధంగా ఆర్థిక సామాజిక అసమానతలను ఏ విధంగా రూపుమాపుతారని ప్రశ్నించారు. విద్యవైద్యానికి ప్రాధాన్యత ఇవ్వకుండా విద్యార్థుల సంక్షేమానికి బడ్జెట్లో కేటాయింపులు నామాత్రంగా కేటాయించారని విమర్శించారు.ప్రతి పేదవాని ఎకౌంట్లో 15 లక్షల రూపాయలు వేస్తాం విదేశాల నుండి నల్లధనాన్ని వెనక్కి తీసుకొస్తాం సంవత్సరానికి రెండు కోట్ల ఉద్యోగాలను ఇస్తామని గత ఎన్నికల్లో ఇచ్చిన హామీల అమలు ఎంతవరకు వచ్చిందనేది ఒక్క మాట కూడా మాట్లాడకపోవడం బిజెపి మోసపూరిత విధానాలకు నిదర్శనం అని అన్నారు. కేంద్రంలో బిజెపి ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ పేదలను మరింత పేదలుగా ధనవంతులని మరింత ధనవంతులుగా మార్చే విధంగా ఉందని అంకెల గారడి తప్ప ప్రజలకు ఒరిగిందేమీ లేదని అన్నారు.

పెండింగ్లో ఉన్న వేతనాలు ఇవ్వాలని మున్సిపల్ కార్మికుల భిక్షాటన



నవతెలంగాణ-సంగారెడ్డి

'పెండింగ్‌లో ఉన్న మున్సిపల్ కాంట్రాక్ట్ కార్మికులకు వేతనాలు ఇవ్వాలి. తొలగించిన కార్మికులను విధుల్లోకి తీసుకోవాలి. అదనపు శానిటరీ ఇన్స్పెక్టర్ విజయబాబును ఉద్యోగం నుంచి తొలగించాలి. లేకుంటే విధులు బహిష్కరిస్తాం' అంటూ గురువారం సీఐటీయూ ఆధ్వర్యంలో సంగారెడ్డి పాత బస్టాండ్ దగ్గర కార్మికులు భిక్షాటన నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా సహా కార్యదర్శి ఎం.యాదగిరి మాట్లాడుతూ జిల్లా కేంద్రమైన సంగారెడ్డి గ్రేడ్ వన్ మున్సిపాలిటీలో గత 2 నెలల నుండి వేతనాలు ఇవ్వకుండా మున్సిపల్ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని అన్నారు. కార్మికులకు వేతనాలు రాక తినడానికి తిండి కూడా ఇబ్బందిగా మారుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నిసార్లు అధికారులు చెప్పిన ఉపయోగం లేకుండా పోతుందని అన్నారు. కార్మికులకు వేతనాలు ఇవ్వకుంటే విధులు బహిష్కరిస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. పెండింగ్లో ఉన్న వేతనాలు కార్మికులకు ఇవ్వాలి కార్మికులు వేతనాలు అడిగితే అదనపు సానిటరీ ఇన్స్పెక్టర్ విజయబాబు ఉద్యోగం నుంచి తొలగిస్తానని కార్మికులకు బెదిరింపులకు దిగుతున్నాడని అన్నారు. అక్రమంగా కార్మికులను తొలగించి వారి స్థానంలో రెండు నుంచి మూడు లక్షలు తీసుకొని కొత్తవారిని ఉద్యోగాలను పెట్టుకుంటున్న విజయబాబుని ఉద్యోగం నుంచి తొలగించాలని ఆయన ప్రభుత్వానికి డిమాండ్ చేశారు. మా ఇంటి దగ్గర పని ఉందని కొందరి కార్మికులను ఇంటికి రావాలని అంటున్నాడు రాకపోతే నీ ఉద్యోగం తీసేస్తానని బెదిరిస్తున్నాడు అని అన్నారు. తొలగించిన కార్మికుల దగ్గరికి వెళ్లి మీరు డబ్బులు ఇస్తే నేను ఉద్యోగం తీసుకుంటానని కార్మికుల దగ్గరికి రాయబారం పంపిస్తున్నాడు ఇదేమి దౌర్భాగ్యం అని మండిపడ్డారు.

ఇలాంటి అదనపు శానిటరీ ఇన్స్పెక్టర్ ని వెంటనే ఉద్యోగం నుంచి తొలగించాలని ఆయన ప్రభుత్వానికి డిమాండ్ చేశారు. లేకపోతే విధులు బహిష్కరించి పోరాటం నిర్వహిస్తామని ఆయన ప్రభుత్వానికి హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ యూనియన్ నాయకులు, యాదగిరి, సురేష్, మల్లేశం, సువర్ణ సంగీత, శశికళ, సుజాత మహేశ్వరి, రాజు, వీరేశం బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

కస్తూర్బా గాంధీ పాఠశాలలో వాయిస్ ఫర్ గర్ల్స్

నవతెలంగాణ-సదాశివపేట



టీనేజ్ బాలికలు పౌష్టికాహారం తీసుకోవాలని, జంక్ ఫుడ్‌కు అలవాటు పడకూడదని వాయిస్ ఫర్ గర్ల్స్ ప్రాజెక్ట్ మేనేజర్ అబంతిక అన్నారు. గురువారం సదాశివపేటలోని కస్తూర్బా గాంధీ పాఠశాలలో బాలికలకు వాయిస్ ఫర్ గర్ల్స్ ప్రోగ్రాంలో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ లలిత తో కలిసి మాట్లాడుతూ టీనేజీలో బాలికలు జాగ్రత్తగా ఉండాలన్నారు. పిల్లలు వేధింపులకు గురైతే 1098 కి కాల్ చేయాలని సూచించారు. పిల్లలు న్యూట్రిషన్ ఆహారం తీసుకోవాలన్నారు. విద్యార్థులు ఆపద సాయం సమయంలో వెంటనే స్పందించాలన్నారు. సైబర్ నేరగాళ్ల పట్ల జరుగుతూ ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పడాల రిత్విక,భావన, ఆదిత్య, దివిజ,ప్రిన్సి, కేజీబీవీ స్టాఫ్ ప్రవీణ, సురేఖ,రమాదేవి,వనజ, ఉజ్వల,అన్నపూర్ణ,ప్రశాంతి పాల్గొన్నారు.

గ్రీన్ ఫీల్డ్ స్టేడియం గ్రౌండ్లో పిచ్చి మొక్కల తొలగింపు

నవతెలంగాణ-జోగిపేట



జోగిపేట గ్రీన్ ఫీల్డ్ స్టేడియం గ్రౌండ్ లో పెరిగిన పిచ్చి మొక్కలను మున్సిపల్ కమిషనర్, సిబ్బంది తక్షణమే స్పందించి తొలగించాలని అందోల్ జోగిపేట మున్సిపల్ 17వ వార్డ్ కౌన్సిలర్ ఆకుల చిట్టిబాబు బుధవారం మీడియా దృష్టికి తీసుకురావడంతో స్పందించిన అందోల్ జోగిపేట మున్సిపల్ పాలకవర్గం, అధికారుల ఆదేశాల మేరకు గురువారం ఉదయం మున్సిపల్ సిబ్బంది పెరిగిన పిచ్చి మొక్కలను తొలగించే పనులు చేపట్టారు. గ్రౌండ్ లోకి వచ్చేవారికి పిచ్చి మొక్కలు ఇబ్బందులకు గురి చేస్తున్నాయని తెలపడంతో అధికారులు తక్షణమే చర్యలు తీసుకున్నారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ ఆకుల చిట్టిబాబు నవతెలంగాణ తో మాట్లాడుతూ అందోల్ జోగిపేట పట్టణాన్ని పచ్చదనం పరిశుభ్రత వైపు తీసుకెళ్లాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. వార్డుల్లోని చెత్తాచెదారం, పిచ్చి మొక్కలను వెంటవెంటనే తొలగించాలని ఆయన అధికారులకు ఆదేశించారు. తాను చెప్పిన వెంటనే స్పందించిన అధికారులకు ఆయన కృతజ్ఞతలు తెలియజేశారు.

నిధులున్నా నిరుపయోగం

- గిరిజన తండాల రోడ్లపై అధికారులు, కాంట్రాక్టర్ నిర్లక్ష్యం
- ఇబ్బందులు పడుతున్న మూడు తండాల గిరిజనులు

నవతెలంగాణ-ఝరాసంగం

గత రాష్ట్ర ప్రభుత్వ హయాంలో గిరిజన తండాలను కలుపుతూ బీటీ రోడ్లు, వాగులపై వంతెనల నిర్మాణానికి నిధులు మంజూరు చేసినా.. పనులు మాత్రం ముందుకుసాగక గిరిజనులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సంగారెడ్డి జిల్లా ఝరాసంగం మండల పరిధిలో నూతన గ్రామ పంచాయతీగా ఏర్పాటైన పూర్యనాయక్,టోప్య నాయక్,చంద్ర నాయక్ తండాలను కలుపుతూ భోజ్యా నాయక్ తండాలో పంచాయితీ ని ఏర్పాటు చేశారు. పై మూడు తండాలను కలుపుతూ కక్కరవాడా గ్రామం నుండి మూడు 3.500 కి. మీ పొడవునా బీటీ రోడ్డు నిర్మాణానికి గత ప్రభుత్వం ఎస్టీ సబ్ ప్లాన్ కింద రూ.2.38 కోట్లు మంజూరు చేసింది. కాంట్రాక్టర్ మట్టి రోడ్డు పనులు ప్రారంభించి ఏడాది గడిచిపోయినా..తిరిగి రోడ్డు పనులు చేయకపోవడంతో పూర్యనాయక్,టోప్య నాయక్,చంద్ర నాయక్ తండాలకు చెందిన గిరిజనులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కనీసం వాగులపై వంతెనలు నిర్మించే పనులు కూడా





ప్రారంభించకపోవడంతో మూడు తండాలకు చెందిన గిరిజనులు అనేక ఇబ్బందులు పడుతున్నారు. ఈ మూడు తండాలకు చెందిన గిరిజనులు మండల కేంద్రానికి రావాలంటే మరో మూడు కి.మీలు అందనంగా ప్రయాణించాల్సిందేనని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వర్షాకాలంలో గర్భవతులుగా ఉన్న మహిళలు వాగులు దాటి తండాకు వెళ్లడానికి చాలా ఇబ్బంది పడ్డా సందర్భాలు ఉన్నాయి. ఆసుపత్రులకు వెళ్లి రావడానికి ప్రజలు పడిన బాధలు వర్ణనాతీతం. గిరిజన ప్రజల బాధలను అర్థం చేసుకుని జిల్లా అధికారులు స్పందించి పనులు త్వరగా ప్రారంభించాలని గిరిజనులు కోరుతున్నారు.

రోడ్డు పనులను వెంటనే ప్రారంభించాలి



కక్కర్వాడ నుంచి పూర్య నాయక్, టోప్య నాయక్, చంద్ర నాయక్ తండలకు సంబంధించిన 3.500 కి . మీ ల మేర బీటీ రోడ్డు పనులను అధికారులు వెంటనే ప్రారంభించాలి. సరైన రోడ్డు సౌకర్యం లేక చాలా ఇబ్బందులు పడాల్సి వస్తోంది. రోడ్డు వేయడానికి నిధులు మంజూరైన అధికారులు,కాంట్రాక్టర్ ఎందుకు నిర్లక్ష్యం చేస్తున్నారో తెలియడం లేదు. అధికారులు స్పందించి త్వరలో రోడ్డు పనులు చేపట్టి పూర్తి చేయాలి.

– కిషన్ నాయక్, బీఆర్ఎస్ మండల ఎస్టీ సెల్ అధ్యక్షుడు

మాజీ సీఎం ప్రమాణ స్వీకారానికి హాజరైన ఎమ్మెల్యే మాణిక్యరావు

నవతెలంగాణ-జహీరాబాద్



బీఆర్ఎస్ పార్టీ వ్యవస్థాపక అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి, గజ్వేల్ శాసన సభ్యులు కల్వకుంట్ల చంద్రశేఖర రావు ప్రమాణ స్వీకార కార్యక్రమానికి శాసనసభ్యులు శ్రీ కోనింటీ మాణిక్‌రావు హాజరయ్యారు. గురువారం అసెంబ్లీలో జరిగిన ప్రమాణస్వీకారానికి హాజరై అనంతరం అసెంబ్లీ లోని మీడియా పాయింట్ లో మాజీ మంత్రి హరీష్‌రావుపై సీఎం చేసిన వాఖ్యలను ఖండించారు.

శివ స్వాములకు నిత్యావసర సరుకుల అందజేత

నవతెలంగాణ-జోగిపేట



జోగిపేటలోని శివ స్వాములకు పట్లూరి శివ శేఖర్ సౌజన్యంతో ఆయన తల్లిదండ్రులు శివ రాములు, రాజ్యలక్ష్మి ఆధ్వర్యంలో నిత్యావసర సరుకులను అందజేశారు. గురువారం వారి స్వగృహంలో శివ స్వాములకు 30 మంది స్వాములకు 41 రోజుల పాటు అవసరమైన నిత్యావసర వస్తువులు అందజేశారు. ప్రతి సంవత్సరం లాగే ఈ సంవత్సరం కూడా శివ స్వాములకు సరిపోయే నిత్యవసర సరుకులను అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 18 ఏళ్ళు గా స్వాములకు సరుకులు అందజేస్తున్నారు. తమకు తోచిన విధంగా సాములకు సహాయ సహకారాలు అందిస్తున్నామని వారు తెలిపారు. ఈ సందర్భంగా శివ స్వాములు పట్లూరి శివ శేఖర్ కుటుంబ సభ్యులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.

ప్రతి గ్రామంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలి

నవతెలంగాణ- న్యాల్‌కల్



ప్రతి గ్రామంలో సీసీ కెమెరాలు అమర్చుకుంటే దొంగతనాన్ని అడ్డుకట్ట వేయచ్చని జహీరాబాద్ డీఎస్పీ రఘు అన్నారు. మిర్జాపూర్(బి) గ్రామ పంచాయతీలో 10 సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. సర్పంచ్ నిర్మలా జగన్నాథ్ రెడ్డి, డీఎస్పీ రఘు, సీఐ నోముల వెంకటేష్, హద్నూర్ ఎస్సై రామనాయుడు, పంచాయతీ పాలకవర్గం గురువారం సీసీ కెమెరాలను ప్రారంభించారు డీఎస్పీ, సిఐ, ఎస్ఐలను పంచాయతీ పాలకవర్గానికి శాలువా పూలమాలతో సన్మానించారు. కార్యక్రమంలో సర్పంచ్ నిర్మల జగన్నాథ్‌రెడ్డి, పంచాయతీ సెక్రెటరీ గాయత్రి, ఉప సర్పంచ్ సుజాత, గ్రామస్తులు వార్డ్ మెంబర్ అరవింద్, సిద్దారెడ్డి, విలాస్ రెడ్డి, మోహన్ రెడ్డి తదితరులు ఉన్నారు.

విద్యార్థులు ఉన్నత శిఖరాలను అధిరోహించాలి

- అదనపు కలెక్టర్ బి చంద్రశేఖర్

నవతెలంగాణ-సంగారెడ్డి



విద్యార్థిని, విద్యార్థులు పక్కా ప్రణాళికను రూపొందించుకొని లక్ష్య సాధన దిశగా కోనసాగాలని తద్వారా ఉన్నత శిఖరాలను అధిరోహించాలని అదనపు కలెక్టర్ బి. చంద్రశేఖర్ సూచించారు. జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ అద్వర్యములో గురువారం సంగారెడ్డి పట్టణములోని బి.సి. స్టడీ సర్కిల్ లో జిల్లా లోని యువతి యువకులకు గ్రూప్ –1, 11, 111, 4 ఉచిత శిక్షణ తరగతులను జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భముగా విద్యార్థులను ఉద్దేశించి అదనపు కలెక్టర్ చంద్రశేఖర్ మాట్లాడూతూ ప్రతి ఒక్కరు లక్ష్య సాధన దిశగా తమ విద్యకు సంభందించిన ప్రణాళికలను రూపొందిచుకొని ప్రభుత్వ ఉద్యోగమే ధ్యేయంగా ఈ శిక్షణను తీసుకోని వెళ్లాలన్నారు. ఉద్యోగము సాధించడానికి ఎంత కష్టపడి చదవాలి, గ్రూప్ –1, 10/1 సాధించడానికి ఏలాంటి మెలుకువలు తీసుకోవాలో సవివరంగా తెలియజేసారు. తాను త్రిబుల్‌ఐటీ చేసే సమయములోనే ఎన్నో ఉద్యోగాలు వచ్చినా, ప్రక్కన పెట్టేసి ఒక సంవత్సరంలో కష్టపడి ఐ.ఏ.యస్ కావాలనే లక్ష్యాన్ని దృఢంగా నిచ్చయించుకోని ముందుకు వేళ్లానన్నారు. ఎన్నో ఆటుపోట్లు ఏదుర్కోని ఈ రోజు తను ఐ.ఎ.యస్. అధికారిగా ఏదిగానన్నారు. ప్రభుత్వ అధికారి ప్రజలకు సేవ చేసే విధంగా ప్రజలకు జవాబుదారిగా ఉంటూ వారికి చేరువగా ఉండాలని తెలియజేసారు. భవిష్యత్తులో ఒక కచ్చితమైన కార్యచరణను రూపొందిచుకొని ముందుకు వెళ్లాలని, ఎప్పుడు ఆదైర్యపడకుండా ముందుకు పోవాలన్నారు. జిల్లా వెనకబడిన తరగతుల అభివృద్ధి అధికారి జగదీష్ మాట్లాడతూ, ప్రస్తుతము ప్రభుత్వము ఏన్నో మౌళిక సదుపాయాలను కల్పించడము జరుగుతుందిని వీటన్నింటిని సద్వినియోగము చేసుకోని విద్యార్థిని విద్యార్థులు మరింత అభివృద్ధి చేందాలని ఆకాంక్షించారు. విద్యార్థులు పరీక్షల సమయములో ఏలాంటి భయాందోలనలకు గురికాకుండా, పరీక్షలను సజావుగా రాసేందుకోసము విషయనైపుణ్యత కలిగిన అధ్యాపక బృందంచే ఆయా సబ్జెక్టులలో అవగహన కల్పిస్తున్నట్లు తెలిపారు. స్వంత తెలివితేటలతో పాటు మనోధైర్యాన్ని ఆత్మవిశ్వాసాన్ని కలిగి ఉండి పరీక్షలను సజావుగా రాయాలని సూచించారు. స్టడీ మోటీరియల్ ను సద్వినియోగం చేసుకోని లక్ష్య సాధన దిశగా ముందుకు సాగాలని కోరారు. కార్యక్రమంలో కోర్సు ప్యాకల్టీ నాగరాజు , కో–ఆర్డినేటర్, రవి నాయక్ , వసతి గృహ సంక్షేమాధికారుల సంఘము రాష్ట్ర అధ్యక్షులు మహ్మద్ గౌస్, బి.సి. స్టడీ సర్కిల్ సిబ్బంది ,తదితరులు పాల్గొన్నారు.

నీకోమాక్ పరిశ్రమలో కార్మిక చట్టాలు అమలు కావడం లేదు

- డీసీఎల్‌కు సీఐటీయూ ఫిర్యాదు



నవతెలంగాణ-ఐడిఎ బొల్లారం: ఐడీఏ బొల్లారంలోని నీకోమాక్ ప్రైవేట్ లిమిటెడ్ పరిశ్రమలో కార్మిక చట్టాలు అమలు కావడం లేదని ఆరోపిస్తూ గురువారం సీఐటీయూ ఆధ్వర్యంలో డిసిఎల్ రవీందర్ రెడ్డి కి ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా సిఐటియు రాష్ట్ర కమిటీ సభ్యులు కే రాజయ్య మాట్లాడుతూ కార్మిక చట్టాలన్నీ తప్పకుండా అమలు అయ్యేటట్లు చూడాలని, చట్టాల అమలు కావడం లేదు పరిశ్రమ యజమాని పైన కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు, ఈ పరిశ్రమలో గత పది సంవత్సరాలు నుంచి పనిచేస్తున్నప్పటికీ కార్మికులను పర్మినెంట్ చేయడం లేదని అన్నారు, కార్మికులను ఉత్పత్తిలో నేరుగా వాడుకోవడం కార్మిక చట్టాల ప్రకారం తప్పు అని అన్నారు, ఉత్పత్తిలో నేరుగా పనిచేయుచున్నప్పుడు పర్మినెంట్ ఎందుకు చేయడం లేదని ఆయన సూటిగా ప్రశ్నించారు, అలాగే ఈ పరిశ్రమలో వలస కార్మికుల చట్టాన్ని మొత్తం తుంగలో తొక్కుతున్నారని అన్నారు, ఈ చట్టాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. వలస కార్మికులకు ఎటువంటి సౌకర్యాలు కల్పించడం లేదని ఆయన అన్నారు, అలాగే కనీస వేతనాలు కూడా సరిగా ఇవ్వడం లేదని అన్నారు, స్కిల్ వర్క్ పేమెంట్ ఇవ్వడం లేదని ఆయన అన్నారు, కార్మికులందరికీ ఈఎస్ఐ ,పీఎఫ్, సెలవులు, యూనిఫామ్, క్యాంటీను, బూట్లు, ఓటి డబ్బులు తదితర సౌకర్యాలు అమలు చేయాలని అన్నారు. కార్మికులకు న్యాయం జరగకపోతే పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని ఆయన హెచ్చరించారు.

ఎస్డిఎస్ఎఫ్ ద్వారా ఎస్సీలకు బోర్ తవ్వటానికి దరఖాస్తుల ఆహ్వానం

నవతెలంగాణ-కల్హేర్



కల్హేర్ మండల పరిధిలోని అన్ని గ్రామాల చెందిన ఎస్సీలకు ఎస్డిఎస్ఎఫ్ ద్వారా పంట పొలాల్లో బోర్స్ తవ్వడానికి డిప్యూటి డైరెక్టర్ గ్రౌండ్ వాటర్ డిపార్ట్మెంట్ సంగారెడ్డి గారు దరఖాస్తులు కోరుతున్నారని కల్హేర్ ఇన్చార్జ్ ఎంపీడీవో శ్రీనివాస్ తెలిపారు. ఇందుకు గాను కనీసము 2 ఒక రైతుకు ఎకరములలోపు భూమి(అసైన్డ్ లేదా పట్టాభూమి ఏదైనను) ఉండాలి లేదా ఇద్దరు లేదా ముగ్గురు నలుగురు రైతులు కలిపితే కనీసం మూడు నుండి ఆరు ఎకరముల భూమి కలిగి ఉండి ఎస్సి కులానికి చెందిన వ్యక్తులు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. ఈ దరఖాస్తు చేసుకొనుటకు అవసరమైన ధ్రువపత్రములు ఎస్సీ రైతు ఫోటో, పట్టాదార్ పాసుపుస్తకం, ఆధార్ కార్డ్, కులం సర్టిఫికెట్, రేషన్‌కార్డ్ జిరాక్స్ కాపీలతో దరఖాస్తులను ఎంపీడీవో కార్యాలయంలో రెండురోజులలోపు సమర్పించాలని సూచించారు.

భూ కబ్జాదారుల నుంచి ప్లాట్లను రక్షించండి

- ప్లాట్ల యజమానుల ఆవేదన
- భూకబ్జాదారులపై చర్యలు తీసుకోండి
- కబ్జాదారులు, ప్లాట్ల యజమానుల మధ్య తోపులాట

నవతెలంగాణ- పటాన్ చెరు



భూ కబ్జాదారుల నుండి మా ప్లాట్లను రక్షించి వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని ప్లాట్ల యజమానులు ప్రభుత్వాన్ని కోరారు. పటాన్ చెరు మండలం పాటి గ్రామపంచాయతీ పరిధిలో తమ ప్లాట్లను హైదరాబాద్ కు చెందిన కొందరు కబ్జా చేస్తున్నారని గురువారం సంబంధిత ప్లాట్ ఓనర్లు శ్రీకాంత్ రెడ్డి, రాజు సాగర్, మేరాజ్ ఖాన్, నరేష్, నయోమి, జ్యోతి లు విలేకరులతో వాపోయారు. పాటి గ్రామపంచాయతీ పరిధిలోని సర్వేనెంబర్ 205, 207 లలో 1983 లో నారాయణరావు లేఔట్ చేసి 140 ప్లాట్లను విక్రయించారని తెలిపారు. ఈ ప్లాట్ల చుట్టూ ఉన్న ప్రహరీ గోడను భూకబ్జాదారులు తొలగించి సెల్లార్ తీద్దామని కిరాయి మనుషులతో పనిచేస్తున్నారని తెలుసుకొని ప్లాట్ల దగ్గరికి వెళ్లి అడ్డుకోగా మధ్య తోపులాట జరిగిందన్నారు. హైదరాబాద్ కు చెందిన హనుమంత్ రెడ్డి అనే వ్యక్తి సురేష్ అనే బిల్డర్ తో మా ప్లాట్లలో అక్రమంగా పనులు చేస్తున్నారని అన్నారు. వెంటనే బీడీఎల్ పోలీసులకు సమాచారం ఇవ్వగా వారు వచ్చే లోపే పరారవ్వగా అక్కడ పని చేస్తున్న కొంతమంది కూలీలను అదుపులోకి తీసుకున్నారన్నారు.ఎంతో కష్టపడి ప్లాట్లు కొనుగోలు చేశామని చెప్పారు.గ్రామపంచాయతీ లేఅవుట్, అనుమతులు ఉన్నాయన్నారు. హక్కుదారులైన మా ప్లాట్లను భూముల రేట్లు పెరగడంతో రియల్ ఎస్టేట్ గద్దాలు కబ్జాలు చేయాలని ప్రయత్నిస్తున్నారని, వీరిపై కఠిన చర్యలు తీసుకోవాలని తహసీల్దార్, పోలీసులను కోరారు. తమ సమస్యను పరిష్కరించాలని, ప్లాట్ల ఆక్రమణకు పాల్పడుతున్న వారిపై చట్టరీత్య చర్యలు తీసుకోవాలని ఈ సందర్భంగా ప్లాట్ల యజమానులు డిమాండ్ చేశారు.

మడివల్ మాచయ్యకు ఘన నివాళి


నవతెలంగాణ-సంగారెడ్డి



సంగారెడ్డి జిల్లా కేంద్రంలో ఐలమ్మ విగ్రహం వద్ద మడివల్ మాచయ్య జయంతి బహుజన సంఘాల ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి పూలమాలవేసి ఘన నివాళి అర్పించారు. కార్యక్రమంలో బహుజన సంఘాల నాయకులు రజక సంఘలా సమితి అధ్యక్షులు నామాల నాగేష్, ఫోరమ్ ఫర్ బెటర్ సంగారెడ్డి అధ్యక్షుడు శ్రీధర్ మహేంద్ర, కుమ్మరి సంఘము ప్రధాన కార్యదర్శి కుమ్మరి సాయిలు,నాయీ బ్రాహ్మణ సంఘము అధ్యక్ష ప్రధాన కార్యదర్శి మామిళ్ళ నాగభూషణం నాయీ, రాజారాం, విశ్వబ్రాహ్మణ సంఘము వారు చంద్రమోహన్ చారి, శివకుమార్, ఫోరమ్ ఫర్ బెటర్ సంగారెడ్డి ఉపాధ్యక్షు డు సజ్జద్ ఖాన్ ప్రధాన కార్యదర్శి అమిదిపురం మహేష్ కుమార్,సాయి రజక సంఘాల సమితి అడ్వైసర్, సంగారెడ్డి పట్టణ అధ్యక్షులు పట్లోరి నర్సిములు, అమిదిపురం రాజు, సాయిదేవా, నారాయణ, వీరయ్య, సత్తయ్య, ప్రభు,అంజన్న, యాదగిరి, అశోక్, విశ్వనాధ్ చారి పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

మున్సిపల్ కాంట్రాక్టు కార్మికుడి మృతి

- ముదిరాజ్ సంగం, మున్సిపల్ తరఫున రూ. 15వేలు ఆర్థిక సహాయం



నవతెలంగాణ-జోగిపేట

అందోల్, జోగిపేట మున్సిపల్ కాంట్రాక్టు కార్మికు డు, పట్టణ ముదిరాజ్ సం ఘం సభ్యుడు, బాయికాడి ఆంజనేయులు (55) బుధవారం రాత్రి అకస్మాత్ గా హార్ట్ ఎటాక్'రావడంతో మృతి చెందారు. గత కొంతకాలంగా మున్సిపల్ కార్యాలయంలో వాటర్ సప్లై విభాగంలో కాంట్రాక్టు కార్మికునిగా పనిచేస్తున్నాడు. ఎప్పటిలాగే బుధవారం రాత్రి భోజనం చేసిన అనంతరం ఒక్కసారిగా కుప్పకూలి పడిపోవడంతో కుటుంబ సభ్యులు వైద్యులకు చూపించడంతో హార్ట్ ఎటాక్ తో మృతి చెందినట్లు ధృవీకరించినట్లు వారు తెలిపారు. విషయం తెలుసుకున్న జోగిపేట పట్టణ ముదిరాజ్ సంఘం అధ్యక్షులు పట్లూరి శివశేఖర్, జోగిపేట మున్సిపల్ చైర్మన్ గూడెం మల్లయ్య, 12వ వార్డు కౌన్సిలర్ కే నాగరాజు, మున్సిపల్ కమిషనర్ తిరుపతయ్య లు మృతుడి ఇంటికి వెళ్లి ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సంతాపాన్ని తెలియజేశారు. మున్సిపల్ తరపున రూ. 10వేలు, ముదిరాజ్ సంఘం తరపున రూ. 5వేలు ఆర్థిక సహాయం వారి కుటుంబ సభ్యులకు అందజేశారు. అనంతరం మధ్యాహ్నం జోగిపేటలో అంత్యక్రియలు నిర్వహించారు.ఈ కార్యక్రమంలో నాయకులు చింతకుంట బిక్షపతి, బాయికాడి భూమయ్య, దాకూరి శంకరయ్య, నార్సింగ్ సాయిబాబా, తుపాకుల సునీల్ కుమార్, ఉలువల వెంకటేశం, చింతకుంట శివ, బాయికాడి శ్రీశైలం, రాజు ,గడ్డమీది వెంకటేశం, సంతోష్,అల్లే సంతోష్, సంగమేష్, పోచయ్య, బీర్ల శంకర్, మహేష్, నాగరాజు, మాజీ కౌన్సిలర్ శరత్ బాబు, తదితర ముదిరాజ్ బంధువులు పాల్గొన్నారు.

అభివృద్ధి పథంలో దేశం

- కేంద్ర బడ్జెట్ హర్షనీయం
- బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి డాక్టర్ రాజు గౌడ్

నవతెలంగాణ-సంగారెడ్డి



కేంద్ర ఆర్థిక శాఖా మంత్రి నిర్మలాసీతారామన్ ప్రవేశపెట్టిన మధ్యంతర బడ్జెట్ ప్రజల బడ్జెట్ అని, బీజేపీ అనుసరిస్తున్న విధానాల ఫలితంగా దేశం అభివృద్ధి పథంలో ముందుందని బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి డాక్టర్ రాజు గౌడ్ అన్నారు. గురువారం ఆయన పార్టీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో మాట్లాడుతూ కేంద్ర బడ్జెట్‌లో యువకులు, మహిళలు, గ్రామీణ, పట్టణ ప్రాంతాల అభివృద్ధి, ఉపాధి, ఉద్యోగ అవకాశాల కల్పన, రోడ్లు, విమానయాన, రైల్వే మార్గాల విస్తరణకు పెద్ద పీత వేయబడిందన్నారు. 9 కోట్ల పేద రైతులు, మహిళలకు ఉపాధి కల్పించబడిందన్నారు. దేశంలో 80 కోట్ల మందికి ఉచితంగా ఆహార పదార్థాలను అందించబడుతుందన్నారు. పీఎం గణశక్తి కొత్త పథకాన్ని ప్రవేశపెట్టబడిందన్నారు. వందే భారత్ రైళ్లను 40 వేల బోగీలలకు అభివృద్ధి చేయబడుతుందన్నారు. యువతకు లక్ష కోట్ల కార్పస్ ఫండ్ ఏర్పాటు చేస్తామన్నారు. కేంద్రం, రాష్ట్రం మధ్య సంబంధాలు పెంచుతామన్నారు. అయుష్మాన్ భారత్ కింద అంగన్వాడీలు, ఆశాలకు వర్తింప చేయనున్నామన్నారు. రూ.43 వేల కోట్ల రుణాలను గ్రామీణ ప్రాంతాలకు ఇవ్వడం జరుగుతుందన్నారు. రూ.7 లక్షల పన్ను రాయితీ ఇస్తామన్నారు. కేంద్రంలో ప్రవేశపెట్టిన బడ్జెట్ పేద, మధ్య తరగతి ప్రజల సంక్షేమం, అభివృద్ధిని దృష్టిలో పెట్టడం జరిగిందన్నారు. ఈ సమావేవంలో నియోజకవర్గ కన్వీనర్ పోచారం రాములు, కార్యాలయ కార్యదర్శి డి. విజయ్ కుమార్, వెంకటనర్సింహ్మారెడ్డి, నాగరాజు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ బీమా చెక్కుల పంపిణీ

నవతెలంగాణ-కల్హేర్



కల్హేర్ మండలంలోని దేవునిపల్లి గ్రామానికి చెందిన భారత్ రాష్ట్ర సమితి పార్టీ కార్యకర్త చిన్నమొళ్ళ సంగయ్య గత కొద్ది రోజుల కింద ప్రమాదవశాత్తు మరణించారు. అతనికి బిఆర్ఎస్ పార్టీ క్రియాశీలక సభ్యత్వం ఉండటంతో అతని భార్య సంగవ్వ కు పార్టీ తరపున రెండు లక్షల రూపాయల ఇన్సూరెన్స్ డబ్బులు మాంజూరు చేయించి గురువారం నాడు నారాయణఖేడ్ మాజీ ఎమ్మెల్యే మహా రెడ్డి భూపాల్ రెడ్డి ఇన్సూరెన్స్ చెక్కును తన స్వగ్రామమైన ఖానాపూర్ కె లోని నివాస గృహంలో అందజేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాజీ ఎమ్మెల్యే భూపాల్ రెడ్డి మాట్లాడుతూ భారత్ రాష్టసమితి పార్టీ(బిఆర్ఎస్) పార్టీ సభ్యత్వం తీసుకున్నా పొందిన ప్రతి కార్య కర్తకు పార్టీ నుండి భీమ సౌకర్యం కల్పించి పార్టీ అండగా ఉంటుందన్నారు. బారాస పార్టీ సభ్యత్వం పొందిన ఏ ఒక్కకార్య కర్త మరణించిన వారికి పార్టీ కల్పించిన భీమ ద్వారా రూ.2 లక్షలు ఇచ్చి వారి కుటుంబలను ఆదుకుంటుందని తెలిపారు. కుటుంబాన్ని పోషించే కుటుంబ యజమాని మరణిస్తే వారి కుటుంబం ఆర్థిక ఇబ్బందులకు గురి కాకూడదని భావించిన తెలంగాణ రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి కే చంద్రశేఖర రావు వారి కుటుంబ సభ్యులను ఆర్థికంగా ఆదుకోవాలని ఆలోచించి బిఆర్ఎస్ పార్టీ బీమా సౌకర్యం కల్పించారన్నారు. తాను గత ఐదు సంవత్సరాల నుండి అమ్మ నియోజకవర్గమైన నారాయణఖేడ్ లో పార్టీ సభ్యత్వ భీమా కలిగి ప్రమాదవశత్తు మరణించిన ప్రతి కార్యకర్త కుటుంబానికి రెండు లక్షల రూపాయలు వందల సంఖ్యలో అందించానని తెలిపారు. ఈ అవకాశం ఏ పార్టీలో లేదని బిఆర్ఎస్ పార్టీలో మాత్రమే ఉందన్నారు. నా నియోజకవర్గ కార్యకర్తలకు నా కుటుంబ సభ్యులకు ఏ చిన్న సమస్య ఆపద వచ్చిన తాను ఎల్లవేళల అందుబాటులో ఉంటానని సమస్య పరిష్కారం అయ్యేంతవరకు కృషి చేస్తానని ప్రతి కార్యకర్తకు అండగా ఉంటానని మాజీ ఎమ్మెల్యే తెలిపారు. కార్యక్రమంలో కల్హేర్ జెడ్పిటిసి నరసింహారెడ్డి స్థానిక గ్రామ సర్పంచ్ సువర్ణ భూపాల్ ,పార్టీ నాయకులు సుధాకర్, నారాయణ, కృష్ణారెడ్డి, తదితరులు, పాల్గొన్నారు.

ఉత్తమ ర్యాంకులు సాధిస్తే ప్రత్యేక బహుమతులు

నవతెలంగాణ-జహీరాబాద్



జహీరాబాద్ పట్టణంలోని పుగట్ నగర్ లో గల ప్రభుత్వ ప్రాథమిక ఉన్నత విద్యాశాఖాలలో పదవ తరగతి చదువుతున్నటువంటి విద్యార్థిని విద్యార్థులు ఉత్తమ ర్యాంకులు సాధిస్తే వారం దరికీ తల తరపున ప్రత్యేక బహుమతులను అందిస్తానని తహసీల్దార్ రవీందర్ అన్నారు. గురువారం ఎంఈఓ బసవరాజ్ తో కలిసి తన దత్తత పాఠశాల ను సందర్శించి పదవ తరగతి చదువుతున్నటువంటి విద్యార్థిని విద్యార్థులకు పలు సూచనలు చేశారు. విద్యార్థిని విద్యార్థులు అధైర్య పడకుండా విద్యను అభ్యసించి ఉత్తమ ర్యాంకులు సాధించాలని అన్నారు. విద్యార్థులకు కావలసినటువంటి సౌకర్యాలను కల్పిస్తున్నామని అన్నారు విద్యాబోధనలో ఏమైనా వడదొడుకులు ఉంటే తమ దృష్టికి తీసుకు వస్తే వాటన్నిటిని పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్చెం మహమ్మద్ హఫీజ్ అలీ సిబ్బంది పాల్గొన్నారు.

ముగిసిన ఫైనల్ క్రికెట్ మ్యాచ్


నవతెలంగాణ-న్యాల్‌కల్



ఉజ్వల్‌రెడ్డి టెన్నిస్ క్రికెట్ టోర్నమెంట్ గంగావార్ గ్రామంలో వారం రోజులుగా కొనసాగింది. ఆటల పోటీలో గెలుపు ఓటమి సహజమేనని క్రికెట్ స్పాన్సర్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ నాయకులు డాక్టర్ ఉజ్వల్ రెడ్డి అన్నారు. క్రీడలతో యువకులకు మానసిక ప్రశాంతత ఉంటుందన్నారు గురువారం గంగావార్ గ్రామంలో ఫైనల్ క్రికెట్ మ్యాచ్ ముగిసింది ఫైనల్ మ్యాచ్ లో గంగావార్ – మెటల్ కుంట యువకుల జట్లు పోటీ చేయగా గంగావార్ జట్టు విన్నర్ నిలిచింది జట్టుకు 51,000 రూ మెటల్ కుంట రన్నర్ కు 31000, నగదు కప్పుతో అందజేశారు. మెటల్ కుంట కాంగ్రెస్ పార్టీ నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు ఉజ్వల్ రెడ్డి క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించడం యువకులకు ఎంతో సంతోషమని మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు శ్రీనివాస్ రెడ్డి , కొత్తపల్లి భాస్కర్ రెడ్డి అన్నారు ఆసక్తికరంగా క్రికెట్ టోర్నమెంట్ ను వీక్షించారు క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించడం కాంగ్రెస్ పార్టీలో మరింత ఆనందం కనిపించింది. కాంగ్రెస్ నియోజకవర్గ నాయకులు డా,, ఉజ్వల్ రెడ్డి కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు శ్రీనివాస్ రెడ్డి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు కొత్తపల్లి భాస్కర్ రెడ్డి, విలాస్ రెడ్డి, రేజింతల్ తిరుపతి రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, సిరాజుద్దీన్, కిరణ్ గౌడ్, బలవంత్ రెడ్డి, విట్టల్, సందీప్, రంజిత్, అబ్బాస్, క్రికెట్ ఆర్గనైజర్లు సందీప్ రెడ్డి, జీవన్ రెడ్డి, పాండు పాల్గొన్నారు.

పకడ్బందీగా పంట నమోదు చేయాలి

నవతెలంగాణ- గజ్వేల్



ఈ సంవత్సరం యాసంగి పంట నమోదు పక్రియ పకడ్బందీగా చేయాలని కోరుతూ గురువారం గజ్వేల్ అగ్రికల్చర్ ఆఫీస్‌లో మండల ఏఓ నాగరాజు కు వినతిపత్రం డి బి ఎఫ్ నాయకులు ఏగొండ స్వామి, వేణు అందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కష్టపడి పండించిన పంటకు గిట్టుబాటు ధర రావాలంటే ప్రభుత్వం నిర్ణయించిన రేటుకు అమ్ముకుంటే రైతుకు ఉపయోగం ఉంటుందన్నారు. దళారులకు అమ్ముకుంటే నష్టాలపాలుకావడం తప్ప రైతు నష్టం తప్ప ఏమీ లేదన్నారు. పంట చేతికందే సమయానికి రైతు అమ్ముకుందామంటే వారు పంట నమోదు చేసి ఉంటే మార్కెట్ లో అమ్ముకోవడానికి సులువుగా ఉంటుందన్నారు. పంట నమోదు చేయకుంటే అమ్ముకోవడానికి చాలా ఇబ్బందులు పడాల్సి వస్తుందన్నారు. రైతులకు ఏఈఓ ల ద్వారా తగు ప్రచారం చేయించి, పంటనమోదును పకడ్బందీగా చేయావల్సిందిగా తమరి ద్వారా ఏఈఓ లకు ఆదేశాలివ్వాలని కోరామన్నారు.గత సంవత్సరం పూర్తి స్థాయిలో పంట నమోదు పక్రియ సరిగ్గ జరగకపోవడం వలన రైతులు చాలా పడ్డారని వారు గుర్తు చేశారు.

గ్రామపంచాయతీ కార్మికునికి గాయాలు

జాతీయ రహదారి సర్వీస్ రోడ్డుపై రోడ్డు ప్రమాదం

నవతెలంగాణ-మనోహరాబాద్



గుర్తు తెలియన వాహనం ఢీకొట్టడంతో గ్రామ పంచాయతీ కార్మికుడికి తీవ్ర గాయాలైన సంఘటన మనోహరాబాద్ మండలంలో బుధవారం రాత్రి జరిగింది. గ్రామపంచాయతీ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి ఆసిఫ్ తెలిపిన వివరాల ప్రకారం మనోహరాబాద్ గ్రామపంచాయతీలో సఫాయి కార్మికుడిగా గ్రామానికి చెందిన గుడ్లజి రమేష్ పని చేస్తున్నాడు. కాగా బుధవారం రాత్రి సమయంలో దండుపల్లి నుంచి మనోహరాబాద్ గ్రామంలోకి జాతీయ రహదారి దాటి సర్వీస్ రోడ్డులో నడుస్తూ వస్తుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొట్టినట్టు తెలిపారు. తీవ్ర గాయాలైన కార్మికుడు రమేష్ ను తూప్రాన్‌లోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా పరిస్థితి విషమించడంతో మెరుగైన వైద్యం కోసం సికింద్రాబాద్ లోని గాంధీ ఆసుపత్రికి తరలించినట్టు తెలిపారు. ఇంకా పరిస్థితి విషమంగానే ఉన్నట్టు ఆసిఫ్ తెలిపారు. గురువారం మధ్యాహ్నం మనోహరాబాద్ గ్రామ కార్యదర్శి రూపాగౌడ్‌తో కలిసి ఆసిఫ్ కార్మికుడిని పరామర్శించారు.

నేటి నుంచి పిఎన్ఆర్ క్రికెట్ టెస్ట్

నవతెలంగాణ-రామాయంపేట



పిఎన్ఆర్ క్రికెట్ టెస్ట్ ట్రోఫీ ఈ నెల 2వ తేది (శుక్రవారం) ప్రారంభమవుతుందని ఆర్గనైజర్లు ఉమా మహేశ్వర్, రాంకీలు తెలిపారు. రామయంపేట పట్టణం లోని కళాశాల మైదానంలో నిర్వహించే ఈ ఏకైక టెస్ట్ మ్యాచ్ విజేతలకు రూ.50 వేలు బహుమతి అందజేస్తామన్నారు. ఈ మ్యాచ్‌ను గ్రేస్ బాల్‌తో నిర్వహిస్తామన్నారు. ఈ మ్యాచ్ వైటీవీ తెలుగు యూట్యూబ్ ఛానల్లో ప్రసారం జరుగుతుందన్నారు ప్రత్యక్ష ప్రసారం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఏలియా, జమీల్, పవన్, ఫయిం, శరత్, సోను, చిన్న పాల్గొన్నారు.

నిధులు లేక నిలిచిన కాంప్లెక్స్ భవన నిర్మాణం

సంవత్సరాలు గడుస్తున్నా ముందుకు సాగని పనులు

నవతెలంగాణ-మనోహరాబాద్





తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా ఏర్పడిన మండలాల్లో మండల కాంప్లెక్స్ భవనాలను నిర్మించాలనే లక్ష్యంతో చేపట్టిన నిర్మాణాలు నిధులు లేక నిలిచిపోయాయి. భవనానికి శంఖుస్తాపనలు చేసి సంవత్సరం గడుస్తున్నా ఇప్పటి వరకు పనులు నత్తనడకన సాగుతున్నాయి. నిర్మాణం చేపట్టిన నాటి నుంచి ఇప్పటి వరకు డబ్బులు రాకపోవడంతో కాంట్రాక్టర్ పనులను నిలిపేశాడు. ఇప్పటి వరకు రెండున్నర కోట్ల రూపాలయ వరకు పనులు చేశామని, కానీ ఇప్పటి వరకు ఎలాంటి బిల్లు రాలేదని కాంట్రాక్టర్ తెలిపారు. అప్పటి తెలంగాణ రాష్ట ముఖ్యమంత్రి కేసీఆర్ తూప్రాన్ మండలంతో పాటు నూతనంగా ఏర్పడిన మనోహరాబాద్ మండలానికి నూతన మండల కాంప్లెక్స్ భవనాలను మంజూరు చేశారు. తూప్రాన్‌కు రూ.8 కోట్లు, మనోహరాబాద్‌కు రూ.5 కోట్లను మంజూరు చేసింది. దాంతో గత సంవత్సరంలో భవన నిర్మాణానికి అధికారులు శంఖుస్థాపనలు చేశారు. కాంట్రాక్టర్ పనులను చేపట్టగా సంవత్సరం గడుస్తున్నా ఇప్పటి వరకు బిల్లులు రాలేని పరిస్థితి నెలకొంది. మనోహరాబాద్ మండల కేంద్రంలోని మండల కాంప్లెక్స్ భవనం నిధులు లేకపోవడంతో పనులు నత్తనడకన సాగాయి. బిల్లులు లేక కాంట్రాక్టర్ పనులను నిలిపేశాడు. సంవత్సరం గడుస్తున్నా కేవలం గ్రౌండ్ ఫ్లోర్ మాత్రమే స్లాబ్ వేయడంతో పాటు ఇంకా గోడలు కూడా పూర్తి కాలేదు. ఈ విషయమై కాంట్రాక్టర్‌ను అడగడంతో ఇప్పటి వరకు రెండున్నర కోట్ల రూపాయల పనులు చేశామని, ఇప్పటి వరకు ఎలాంటి బిల్లు రాలేదన్నారు. బిల్లులు రాకుంటే పనులు ఎలా చేయాలంటూ కాంట్రాక్టర్ వాపోయారు. కాగా ప్రభుత్వం మారిందని ఇప్పుడైనా బిల్లులను త్వరగా అందజేస్తే పనులు పూర్తి చేస్తామని తెలిపారు. త్వరగా పనులు ప్రారంభమయ్యే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

చెరువు ఎఫ్‌టీఎల్‌ను ఆక్రమిస్తే చట్టరీత్యా చర్యలు

ఎఫ్‌టీఎల్‌లో కట్టడాలు చేపట్టవద్దు

నవతెలంగాణ-మనోహరాబాద్



చెరువు ఎఫ్‌టీఎల్‌కు సంబంధించిన భూములను కేవలం పంటలు పండించుకునేందుకు మాత్రమే ఉంచుకోవాలని అందులో ఎలాంటి కట్టడాలు కట్టి ఆక్రమించినా చట్టపరంగా చర్యలు తీసుకుంటామని ఇరిగేషన్ శాఖ డీఈ శ్రీకాంత్ పేర్కొన్నారు. మనోహరాబాద్ మండల కేంద్రంలోని చెరువు ఎఫ్‌టీఎల్‌ను ఒకరు ఆక్రమించి షెడ్డును ఏర్పాటు చేయడంతో గురువారం పరిశీలించామని, సంబంధిత వ్యక్తికి నోటీసులు జారీ చేయనున్నట్టు తెలిపారు. మండల కేంద్రంలోని ఓ ప్రైవేటు వెంచర్‌లో ఉన్న జైన మందిరం సమీపంలోని భూమిలో గోశాలను ఏర్పాటు చేశారు. కాగా గతంలో కురిసిన వర్షాలకు గోశాలలోని ఆవులు నీటిలో ఉండడంతో వాటిని పక్కకు మార్చారు. కాగా అక్కడే గోశాలను నిర్మించేందుకు చెరువు ఎఫ్‌టీఎల్‌లోనే పక్కా నిర్మాణం చేపట్టారు. గోశాల పేరుతో ఎఫ్‌టీఎల్‌కు చెందిన భూమిలో పక్కా నిర్మాణం చేపట్టారు. దాంతో ఇరిగేషన్ అధికారులకు సమాచారం ఇవ్వడంతో ఉదయం వచ్చి పరిశీలించారు. వెంటనే ఎఫ్‌టీఎల్‌లో నిర్మించిన షెడ్డును తొలగించాలని ఆదేశాలు ఇచ్చారు. వెంటనే స్థల యజమానికి నోటీసులు జారీ చేయనున్నట్టు ఇరిగేష్ డీఈ శ్రీకాంత్ తెలిపారు. ఎవరైనా చెరువు ఎఫ్‌టీఎల్‌ను ఆక్రమించి నిర్మాణాలు చేపట్టవద్దని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో ఇరిగేషన్ ఏఈ అనురాధ తదితరులు ఉన్నారు.

అంతర్జాతీయ స్థాయిలో బంగారు పతకం రావడం జిల్లాకే గర్వకారణం

జిల్లా అదనపు కలెక్టర్ రమేష్

నవతెలంగాణ-మెదక్



అంతర్జాతీయ స్థాయిలో బంగారు పతాకాన్ని, ఛాంపియన్ షిప్‌ను సాధించిన నామ నిత్యశ్రీ సిరిని జిల్లా అదనపు కలెక్టరు రమేష్ అభినందించారు. గురువారం కలెక్టర్ కార్యాలయంలోని అదనపు కలెక్టరు ఛాంబర్‌లో రెండవ అంతర్జాతీయ స్థాయిలో జరిగిన అండర్ 15 కరాటే బ్లాక్ బెల్ట్ పోటీలో పాల్గొని జిల్లాకు బంగారు పతాకాన్ని, ఛాంపియన్ షిప్ ను సాధించిన నామ నిత్యశ్రీ సిరిని అభినందించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టరు రమేష్ మాట్లాడుతూ నిత్యశ్రీ సిరి జిల్లాకే గర్వకారణమని కొనియాడారు. నామ నిత్యశ్రీ సిరి యువతకు ఆదర్శమన్నారు. కోచ్ నగేష్ మాల్లురి మాట్లాడుతూ రెండవ అంతర్జాతీయ స్థాయిలో జరిగిన కరాటే పోటీలు హైదరాబాద్‌లోని సరూర్ నగర్‌లోని ఇండోర్ స్టేడియంలో జనవరి 28న జరిగాయన్నారు. అంత్జాతీయ అండర్ 15 కరాటే బ్లాక్ బెల్ట్ పోటీలలో 30 దేశాల నుంచి దాదాపు 3000 మంది పాల్గొన్నారని, మెదక్ జిల్లా నుంచి మెదక్ పట్టణంలో ఉన్న గురుకుల రెసిడెన్షియల్ పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న నామ నిత్యశ్రీ సిరి, మాస్టర్ నగేష్ మల్లురి, దినకర్‌ల అధ్వర్యంలో శిక్షణ పొంది, పోటీలో పాల్గొని అత్యుత్తమ ప్రతిభ కనబరిచారన్నారు. అంతర్జాతీయ స్థాయిలో అండర్ 15 కరాటే బ్లాక్ బెల్ట్‌లో బంగారు పథకం, ఛాంపియన్ షిప్ రావడం సంతోషంగా ఉందని. తల్లితండ్రులు పద్మ, శ్రీనివాస్‌లు సంతోషం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికారి బ్రహ్మజి, పద్మలత, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఏకగ్రీవంగా యుటిఎఫ్ నూతన కమిటీ ఎన్నిక

నవతెలంగాణ-కౌడిపల్లి





మండల యూటిఎఫ్ నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గురువారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరిగిన టీఎస్ యుటిఎఫ్ మండల సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షులు జి శ్రీనివాసరావు, ఎన్నికల అధికారిగా జిల్లా ప్రధాన కార్యదర్శి కే పద్మారావు, జిల్లా కార్యదర్శి జ్యోతి పాల్గొని నూతన మండల కమిటీని ఎన్నుకున్నారు. కౌడిపల్లి మండలం నూతన అధ్యక్షులుగా ఎస్.రాజు, ప్రధాన కార్యదర్శిగా పి.శేశగిరి రావు, ఉపాధ్యక్షులుగా ఎన్.మహిపాల్, నీలమ్మ, కోశాధికారిగా బి.కనకరాజు, మండల ఆడిట్ కన్వీనర్‌గా సిహెచ్ యాదగిరి, కార్యవర్గ సభ్యులుగా త్యాగయ్య, ఎస్.కె బబ్బు, నర్సింలు, శ్రీనివాస్, హరి నారాయణ, అనిత, పెంటయ్య, నవీన్, రేణుక, సల్మా జిల్లా కార్యవర్గ సభ్యులుగా కృష్ణ, గుండయ్య, రమేష్ మొదలైన వారు ఏకగ్రీవంగా ఎన్నికైనారు. నూతనంగా ఎన్నికైన రాజు, శేషగిరిరావులు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగులకు ఇవ్వాల్సిన మూడు డిఏలు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. నిలిచిపోయిన బదిలీలు, ప్రమోషన్లు వెంటనే చేపట్టాలని, భాషా పండితుల, పిఈటిలకు ప్రమోషన్లు చేపట్టాలని కోరారు. ప్రభుత్వం మేనిఫెస్టో పెట్టినట్టు సిపిఎస్‌ను వెంటనే రద్దు చేసి, ఓల్డ్ పెన్షన్ స్కీంను పునరుద్ధరించాలని ఈ సందర్భంగా వారు డిమాండ్ చేశారు. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు.

నిరంతరం ప్రజాసేవలో ఉంటా

మండల సర్పంచుల ఫోరం మాజీ అధ్యక్షుడు చిలుముల వెంకటేశ్వర రెడ్డి

నవతెలంగాణ-కౌడిపల్లి



సర్పంచి పదవీ కాలం ఐదు సంవత్సరాలతో ముగుస్తుందిగాని ప్రజాసేవ మాత్రం నిరంతరం కొనసాగుతూనే ఉంటుందని మండల సర్పంచ్‌ల ఫోరం మాజీ అధ్యక్షుడు చిలుముల వెంకటేశ్వర రెడ్డి పేర్కొన్నారు. గురువారం మండల కేంద్రమైన కౌడిపల్లి గ్రామపంచాయతీ కార్యాలయంలో పంచాయతీ పాలకవర్గానికి గ్రామస్తులు శాలువలతో ఘనంగా సన్మానం చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ వెంకటేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ మాజీ సీఎం కేసీఆర్, మాజీ ఎమ్మెల్యే చిలుముల మదన్ రెడ్డి, ప్రస్తుత ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డిల నాయకత్వంలో గ్రామాల్లో అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. గ్రామాల్లో నర్సరీలు, పల్లె ప్రకృతివనాలు, వైకుంఠ ధామాలు, ట్రాక్టర్, ట్యాంకర్, మిషన్ భగీరథ ద్వారా ప్రతి ఇంటికి మంచినీరు ఆసరా, ఇలా ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామన్నారు. దేశానికి ఆదర్శంగా రాష్ట్రాన్ని నిలిపిన కృషిలో తాము పాత్రులమైనందుకు గర్విస్తున్నామన్నారు. ఈ సందర్భంగా గ్రామ పెద్దలు మాట్లాడుతూ ఐదు సంవత్సరాల కాలంలో గ్రామానికి ఎనలేని సేవలందించినందుకు పాలకవర్గానికి కృతజ్ఞతలు, అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ చంద్రం శ్రీనివాస్ గౌడ్, వార్డు సభ్యులు, చిలుముల చిన్నం రెడ్డి, ఉడుత నాగ రాణి రాజు, తిరుమలేష్ , రెడ్డి రాజు, సరిత జగన్, బర్ల శోభ కృష్ణ, కలమ్మ పెంటగౌడ్, గొల్ల కొమురమ్మ, బిస్స నర్సింలు, గ్రామ సెక్రెటరీ వెంకటేష్, కాలేరు శివంజనేయులు, పురుషోత్తమ్, షెట్టయ్య, పుండరికం గౌడ్, వెంకటేశం, భిక్షపతి, జగన్, కరొబార్ ఎల్లం తదితరులు పాల్గొన్నారు.



నస్కల్ గ్రామ పాలకవర్గం ఆత్మీయ సన్మానం

నవతెలంగాణ-నిజాంపేట్



మండల పరిధిలోని నస్కల్ గ్రామపంచాయతీ పాలకవర్గానికి గురువారం గ్రామపంచాయతీ ఆవరణలో గ్రామ కార్యదర్శి సబిత ఆధ్వర్యంలో ఆత్మీయ సన్మానం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ కవిత రాజు మాట్లాడుతూ గ్రామంలో అందరి సహాయ సహకారాల వల్ల గ్రామానికి వచ్చిన నిధులను ఆయా అభివృద్ధి పనులకు ఖర్చు చేశానన్నారు. ఐదేళ్లుగా ప్రజల ఆధారాభిమానులతో ఆప్యాయతల నడుమ గ్రామాభివృద్ధికి చేసిన పనుల పట్ల ప్రజల మన్ననలు అందుకున్నామన్నారు. ఎంపీపీ సిద్దరాములు మాట్లాడుతూ నస్కల్ గ్రామానికి ప్రభుత్వ పథకాల అమలు సంక్షేమ పథకాల లబ్ధిదారుల ముంగిట చేరడానికి గ్రామ పాలకవర్గం ఎంతో కృషి చేసిందన్నారు. గ్రామానికి మండలంలో అన్ని గ్రామాల కన్నా ఎక్కువ నిధులను గ్రామానికి తీసుకొచ్చామని, ఇకముందు కూడా అందరు కలిసికట్టుగా ఉండి గ్రామాభివృద్ధికి కృషి చేయాలన్నారు. ఈ సందర్భంగా గ్రామానికి ప్రభుత్వ పథకాలలో పల్లె ప్రకృతి వనం, డంపింగ్ యార్డ్, క్రీడా ప్రాంగణం తదితర అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టామన్నారు. గ్రామ పంచాయతీ పరిధిలో పనిచేసి మృతి చెందిన కర్రయ్య, పోలు బాలయ్య, రామచంద్రారెడ, మద్దికుంట భూదయ్యలను తలచుకుంటూ సమావేశంలో మృతులకు నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ తీగల జ్యోతి, వార్డు సభ్యులు జెడ్పీహెచ్ఎస్ ప్రధానోపాధ్యాయులు, అంగన్వాడీ టీచర్లు నాతిలక్ష్మి గౌడు, దుబాసి సంజీవ్, కరోబార్ శ్రీనివాస్ రెడ్డి, ఎల్లం యాదవ్, దుర్గయ్య, ఫీల్డ్ అసిస్టెంట్ శీను, పారిశుధ్య కార్మికులు, గ్రామ పెద్దలు, యువకులు తదితరులు పాల్గొన్నారు.

మెదక్ నియోజకవర్గం అభివృద్దే లక్ష్యం

ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్

నవతెలంగాణ-పాపన్నపేట



మెదక్ నియోజకవర్గ అభివృద్దియే తమ లక్ష్యమని మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావు అన్నారు. గురువారం పాపన్నపేట మండల పరిధిలోని ఎల్లాపూర్, పొడిచాన్‌పల్లి గ్రామాలలో పలు అభివృద్ధి కార్యక్రమాలలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏల్లాపూర్‌లో అంగన్వాడి కేంద్రం, పశు వైద్యశాల భవనాన్ని, పొడిచాన్‌పల్లిలో గ్రామపంచాయతీ అంగన్వాడి భవనాలను ఆయన ప్రారంభించారు. అనంతరం లక్ష్మి నగర్‌తో పాటు వివిధ గ్రామాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తనను ఎమ్మెల్యేగా గెలిపించినందుకు ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేస్తామని పేర్కొన్నారు. నియోజకవర్గం అభివృద్ధికి ప్రతి ఒక్కరు తమ సహకారం అందించాలని కోరారు. గతంలో ఏ పనికి అయినా ప్రజలు మీసేవ కేంద్రాల చుట్టూ తిరగాల్సి వచ్చేదని, ఇప్పుడు అలా కాకుండా ప్రజల వద్దకే అధికారులు వస్తున్నారన్నారు. అధికారులు ప్రజలకు జవాబు దారిగా పనిచేయాలని ఈ సందర్భంగా సూచించారు. పొడిచాన్‌పల్లి పాఠశాలలో మరుగుదొడ్లు, ఏల్లాపూర్ పాఠశాలలో ప్రహరీ గోడ నిర్మాణానికి సహకరిస్తామని వెల్లడించారు. ఎమ్మెల్యే వెంట పాపన్నపేట ఎంపీపీ చందన ప్రశాంత్ రెడ్డి, జిల్లా కిసాన్ సెల్ అధ్యక్షులు ప్రభాకర్ రెడ్డి, మండల శాఖ అధ్యక్షులు గోవింద్ నాయక్, ఆకుల శ్రీనివాస్, కో ఆప్షన్ సభ్యులు గౌస్ జీవన్ రెడ్డి, ప్రతాపరెడ్డి, ఎల్లాపూర్ శ్రీధర్, కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మెదక్ ఎంపీ అభ్యర్థిగా అవకాశం కల్పించాలి

నవతెలంగాణ-సంగారెడ్డి



గజ్వేల్ ఎమ్మెల్యేగా గెలుపొంది గురువారం ప్రమాణ శ్వీకారం చేసిన బీఆర్ఎస్ పార్టీ అధినేత కేసీఆర్‌ను బీరయ్య యాదవ్ కలిసి శుభాకాంక్షలు తెలిపారు. మెదక్ పార్లమెంటు అభ్యర్థిగా తనకు అవకాశం కల్పించాలని కేసీఆర్‌ను కోరినట్లు బీఆర్ఎస్ రాష్ట్ర సీనియర్ నాయకుడు, తెలంగాణ ఉద్యమకారుడు బీరయ్య యాదవ్ తెలిపారు. ఈ మేరకు కేసీఆర్ స్పందించి పరిశీలిస్తామని, అండగా ఉంటామని భరోసా కల్పించారని బీరయ్య యాదవ్ తెలిపారు.

గ్రామాల్లో చేసిన సేవలు గుర్తింపునిస్తాయి

నవతెలంగాణ-వెల్దుర్తి



గ్రామాల్లో సర్పంచులు చేసిన అభివృద్ధి పనులు, సేవలు మరువలేనివని, ఆ పనులే వారికి గుర్తింపునిస్తాయని ఎంపీపీ స్వరూప నరేందర్ రెడ్డి అన్నారు. గురువారం మండల కేంద్రంలో ఎంపీడీవో కార్యాలయం ఆవరణంలో గ్రామపంచాయతీ పాలకవర్గాన్ని, సర్పంచులను జెడ్పీటీసీ రమేష్ గౌడ్, ఎంపీడీవో వెంకటలక్ష్మిలతో కలిసి ప్రశంసించారు. 30 మంది సర్పంచ్‌లను మెమోంటోను అందజేసి శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా గ్రామ పంచాయతీల వారిగా సర్పంచులు చేసిన అభివృద్ధి పనులను, వారు పడ్డ బాధలు సభాముఖంగా సర్పంచులు వివరించారు. ఈ సందర్భంగా ఐదేళ్ల పదవీకాలం పూర్తి కావడంతో వీడ్కోలు సభను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారినుద్దేశించి ఎంపీపీ స్వరూప నరేందర్ రెడ్డి మాట్లాడారు. గ్రామాల అభివృద్ధికి పెద్ద పీట వేయడం సర్పంచులతోనే సాధ్యమైందన్నారు. దేశంలో ఎక్కడ లేని విధంగా గ్రామ గ్రామాన స్మశాన వాటికలు, చెత్త సేకరణ ట్రాక్టర్లు, నర్సరీలు, పార్కులు, క్రీడా మైదానాలు తదితర అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టడం గర్వకారణమన్నారు. గ్రామీణ అభివృద్ధిలో కీలక పాత్ర పోషించిన సర్పంచుల సేవలు మరువలేనిదన్నారు. పదవులు ఉన్నా లేకున్నా ప్రజల పక్షాన నిలబడి ఎప్పటికప్పుడు పరిష్కరించేందుకు ఇకముందు కూడా కృషి చేస్తారని ధీమా వ్యక్తం చేశారు. గ్రామపంచాయతీ పాలకవర్గాలకు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యకమంలో 30 గ్రామపంచాయతీ సర్పంచులు, ఎంపీటీసీలు, అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

భారతీయ కిసాన్ సంఘ్ సభ్యత్వ నమోదు

నవతెలంగాణ-నార్సింగి



మండల కేంద్రంలో గురువారం భారతీయ కిసాన్ సంఘ్ సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా 300 మంది రైతులు ఇప్పటివరకు సభ్యులుగా చేరారు. ఈ సందర్భంగా భారతీయ కిసాన్ సంఘ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పన్యాల వెంకటరెడ్డి మాట్లాడుతూ రైతు పండించిన పంటకు గిట్టుబాటు ధర కల్పించాలని భారతీయ కిసాన్ సంఘ్ తరపున డిమాండ్ చేశారు. రైతుల సంక్షేమం కోసం భారతీయ కిసాన్ సంఘ్ ముందుండి పనిచేస్తుందన్నారు. వ్యవసాయదారుడికి నష్టం కలగకుండా భారతీయ కిసాన్ సంఘ్ మద్దతుగా నిలిచిందని పేర్కొన్నారు. ఇందులో భాగంగా వ్యవసాయంలో రైతులు విద్యుత్ సమస్యల వల్ల నష్టపోతున్న వారికి పిఆర్సి సిజిఆర్ఎఫ్ ద్వారా సమస్యలను గుర్తించి రైతులకు పరిష్కార మార్గాలు చూపిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మెదక్ జోనల్ అధ్యక్షుడు రాజ శ్రీకాంత్ రెడ్డి, మెదక్ జిల్లా కార్యదర్శి అనిల్ కుమార్, నరసింహారెడ్డి, నాగోజి, రామ్ రెడ్డి, సోమరాజ్, ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు గిరికల దుబ్బయ్య, పోచమ్మల స్వామి, శ్రీశైలం, పోచమ్మల ఎల్లం, రైతులు సంఘ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

టిడబ్ల్యూజెఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఏల్గోయి ప్రభాకర్‌ను సన్మానించిన కూన వేణు



నవతెలంగాణ-సంగారెడ్డి

తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు, సంగారెడ్డి జిల్లా అధ్యక్షులు ఎల్గోయి ప్రభాకర్, సిటిజన్ ఆస్పత్రి మేనేజర్ రమేష్‌లను కూన గంగమ్మ ఫౌండేషన్ ఆధ్వర్యంలో బుధవారం రాత్రి తెలంగాణ యువజన సంఘాల రాష్ట్ర అధ్యక్షులు కూన వేణు ఘనంగా సన్మానించారు. 20 ఏండ్లుగా ఉమ్మడి మెదక్ జిల్లాతో పాటు, ఆంధ్ర ప్రదేశ్, తెలంగాణ రాష్ట్రంలోనూ జర్నలిస్టుల సమస్యలపై, వారి సంక్షేమం కోసం నిరంతరం పోరాటం చేస్తూ, సామాజిక సేవా రంగంలోనూ ముందున్న గొప్ప మనసున్న యువ నేత ఎల్గోయి ప్రభాకర్ అని కూన వేణు కొనియాడారు. కోవిడ్ సమయంలోనూ అనేక మంది పేదలకు, ఇతర రాష్ట్రాలకు చెందిన అసంఘటిత రంగంలోని కార్మికులకు తన వంతు సాయం చేశారన్నారు. తన ప్రాణాలకు లెక్కచెయ్యకుండా తొలి, రెండవ కోవిడ్ సమయంలో ప్రభాకర్ చేసిన సేవ మరువలేనిదన్నారు. ప్రభాకర్ దేశవ్యాప్త నేతగా ఎదగాలని మనసారా కోరుకుంటున్నానన్నారు. ఈ కార్యక్రమంలో కూన గంగమ్మ ఫౌండేషన్ ఛైర్మెన్ కూన దుర్గయ్య, సభ్యులు దశరథ్ రాజు, శ్రీనివాస్ రాజు, రమేష్ కుమార్, సంతోష్ కుమార్, సురేష్ కుమార్, సాయి, సిద్దు, భాషా తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులలో జాతీయ భావాన్ని పెంపొందించాలి

మండల నోడల్ ఆఫీసర్ నీరజ



నవతెలంగాణ-చేగుంట

విద్యార్థుల్లో జాతీయ భావాన్ని నైతిక విలువలను పెంపొందించాలని మండల నోడల్ ఆఫీసర్ నీరజ అన్నారు. మండల కేంద్రంలోని శ్రీ కృష్ణవేణి టాలెంట్ స్కూల్లో మండల స్థాయి సోషల్ ప్రతిభా పరీక్ష నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మండల నోడల్ ఆఫీసర్ నీరజ హాజరై మాట్లాడారు. మండల స్థాయిలో ఇంగ్లీష్ మీడియం విభాగంలో మొదటి బహుమతి రేవతి, రెండో బహుమతి ధనుష్, తెలుగు మీడియం విభాగంలో మొదటి బహుమతి అశోక్, రెండవ బహుమతి శ్రావణి, ప్రైవేటు స్కూల్ విభాగంలో మొదటి బహుమతి శ్రీప్రియ, రెండో బహుమతి శ్రీవర్షిత గెలుచుకున్నారు. వీరికి మండల నోడల్ ఆఫీసర్ బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో సోషల్ ఫోరమ్ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు పెంట గౌడ్, ఆంజనేయులు, తపస్ జిల్లా ప్రధాన కార్యదర్శి చల్లా లక్ష్మణ్, ఎస్టియు మండల అధ్యక్షుడు మనోహర్ రావు, తపస్ మండల అధ్యక్షులు వెంకటేష్, శ్రీకృష్ణవేణి స్కూల్ ప్రధానోపాధ్యాయులు వివేక్, ఉపాధ్యాయులు అజిత, పద్మ కోటయ్య ప్రణయ్, రమాదేవి, ఝాన్సీ, సుభాష్ గౌడ్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

పోలీసులు ఫోన్ లాక్కోడంతో యువకుడి ఆత్మహత్యయత్నం

నవతెలంగాణ-సంగారెడ్డి



పోలీసులు తన ఫోన్ తీసుకొని తిరిగి ఇవ్వలేదనే నెపంతో ఓ యువకుడు ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డ సంఘటన గురువారం రాత్రి సంగారెడ్డి పట్టణంలో చోటు చేసుకుంది. సంగారెడ్డి చౌరస్తాలో పోలీసులు వాహనాలు తనిఖీ చేస్తూ చాలాన్లు రాస్తున్న సమయంలో బస్సు దిగిన ఓ యువకుడు తన ఫోన్లో పోలీసుల ఫోటోలు, వీడియోలు తీశాడు. దీన్ని గమనించిన పోలీసులు తమ ఫోటోలు ఎందుకు తీస్తున్నావు అంటూ సదరు యువకుడి ఫోన్‌ను లాక్కున్నారు. ఫోను తిరిగి ఇవ్వకపోవడంతో కలత చెందిన యువకుడు పక్కనే ఉన్న పెట్రోలు బంక్‌కు వెళ్లి పెట్రోల్ తెచ్చుకున్నాడు. చౌరస్తాలో ఉన్న చరిత హాస్పిటల్ వద్ద ఒంటిపై పెట్రోలు పోసుకుని నిప్పంటించుకున్నాడు. చుట్టుపక్కల వాళ్ళు మంటలార్పి హాస్పిటల్‌లో చేర్పించారు. మెరుగైన వైద్యం కోసం స్థానిక జిల్లా కేంద్ర హాస్పిటల్‌కు తరలించారు.

ప్రొఫెసర్ కోదండరాంకు ఘన సత్కారం

నవతెలంగాణ-సంగారెడ్డి



తెలంగాణ ఉద్యమ సారధి , టీజేఎస్ అధినేత, ప్రొఫెసర్ కోదండరాంను ప్రభుత్వం ఎమ్మెల్సీగా నియామకం చేసినందున సంగారెడ్డి జిల్లా కేంద్రంలో టీజె ఎస్ టీజీ ఏ సి ప్రజా సంఘాల ఆధ్వర్యంలో పౌర సన్మానం చేశారు. ముందుగా సంగారెడ్డిలోని తెలంగాణ అమరవీరుల స్థూపానికి పూలమాలలు వేసి ఘన నివాళి అర్పించారు. అనంతరం జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో ప్రొఫెసర్ కోదండరాం కు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా కోదండరాం మాట్లాడుతూ తెలంగాణ ప్రజలు మార్పు కోరారని అందుకు బీఆర్ఎస్ పతనమై కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందన్నారు. బీఆర్ఎస్ హయాంలో అన్ని శాఖలు నిర్వీర్యమయ్యాయని, భూ సెటిల్మెంట్లు ఇసుక కాంట్రాక్టర్ల దోపిడి బీఆర్ఎస్ పాలనలో జరిగాయన్నారు. ట్రిబుల్ ఆర్ పునర్నిర్మాణం ఆలోచన చేస్తామన్నారు. ఉద్యమకారులను కాంగ్రెస్ ప్రభుత్వం గుర్తించిందన్నారు. ప్రజల పక్షాన నిరంతరం పోరాటం నిర్వహిస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో టీజేఎస్ జిల్లా అధ్యక్షులు తుల్జారెడ్డి, టీపీటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు వై. అశోక్ కుమార్, తెలంగాణ ఉద్యమ కారులు అన్వార్ పటేల్, బహుజన సంఘాల నాయకులు అనంతయ్య, మల్లయ్య, లక్ష్మయ్య, టీజేఎస్ ప్రధాన కార్యదర్శి కుమ్మరి సాయిలు, ఫోరమ్ ఫర్ బెటర్ సంగారెడ్డి నాయకుల, శ్రీధర్ మహేంద్ర, సజ్జద్ ఖాన్, మహేష్ కుమార్, శ్రీకాంత్, పాండు, సాయి వరాల, రాము,కిషన్, పలు ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

మండలంలో పంచాయతీలకు స్పెషల్ ఆఫీసర్లు వీరే

నవతెలంగాణ-కౌడిపల్లి



కౌడిపల్లి మండలంలోని గ్రామ పంచాయతీలకు స్పెషల్ ఆఫీసర్లను ప్రభుత్వం కేటాయించింది. గురువారం జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు మండలంలో 29 గ్రామ పంచాయతీలకు స్పెషల్ ఆఫీసర్ల పాలన కొనసాగుతుంది. భుజంపేట్, మనంతయ్య పల్లి తండాలకు డిప్యూటీ తహశీల్దార్, బూరుగడ్డ, కుషన్ గడ్డ తండా, నగ్సన్ పల్లిలకు ఐబి ఏఈ రవి మోహన్, దేవులపల్లి, ధర్మసాగర్, వెల్మకన్నె గ్రామ పంచాయతీలకు తహశీల్దార్ ఆంజనేయులు, హరిచంద్ తండా, పీర్ల తాండలకు అగ్రికల్చర్ ఏడిఏ పుణ్యవతి, జాజితాండ, కొచ్చెరువు తాండలకు ఆర్డబ్ల్యూఎస్ ఏఈ అరవింద్ సాగర్, కంచన్పల్లికి హెచ్ఎం బుచ్చిరెడ్డి, కొట్టాల, కౌడిపల్లి, కుకుట్లపల్లి గ్రామాలకు ఎంపీడీవో శ్రీనివాస్, మర్రిచెట్టు తండా, మహమ్మద్ నగర్, ముత్రాజ్ పల్లి, పీర్య తాండలకు ఎంపీఓ కరిముల్లా, రాజిపేట్, సదాశివపల్లిలకు పశువైద్య అధికారి డాక్టర్ రాజు, రైలాపూర్‌కు హెచ్ఎం ఎల్ జ్యోతి, సలాబత్పూర్, షేరి తాండలకు ఏఈ ప్రభాకర్, తిమ్మాపూర్, వెంకట్రావుపేట్‌లకు ఇరిగేషన్ డీఈఈ జగన్నాథం, తునికికి ఆర్డబ్ల్యూఎస్ ఏఈ సురేష్, వెంకటాపూర్ ఆర్ గ్రామాలకు ఎంపీ ఎస్ఓ నర్సింలులను ప్రత్యేక అధికారులుగా నియమించారు.

జిల్లా స్థాయికి ఎంపికైన మోడల్ స్కూల్ విద్యార్థి అలేఖ్య



నవతెలంగాణ -నంగునూరు

అక్కెనపల్లి మోడల్ స్కూల్ విద్యార్థిని పి.అలేఖ్య ఇంగ్లిషు మీడియంలో మండల ప్రథమ స్థానం సాధించి జిల్లా స్థాయికి ఎంపికైంది. నంగునూరు మండల కేంద్రంలో సోషల్ స్టడీస్ ఫోరం ఆధ్వర్యంలో మండలంలోని 10 ఉన్నత పాఠశాలల పదవతరగతి విద్యార్థులకు సోషల్ టాలెంట్ టెస్ట్ నిర్వహించారు.ఈ పరీక్షలో మొత్తం ఇంగ్లీషు మీడియంలో 20మంది విద్యార్థులు పాల్గొన్నారు.మండల ద్వితీయ స్థానం జిల్లా పరిషత్తు హైస్కూల్ నర్మెట విద్యార్థి వి.అవినాష్ రెడ్డి, తృతీయ స్థానం పి.పావని జిల్లా పరిషత్ హైస్కూల్ అంక్షాపూర్ నిలిచింది.గెలిచిన విజేతలకు ప్రధానోపాధ్యాయులు రామస్వామి, నాగార్జున రెడ్డి,మండల సోషల్ ఫోరం అధ్యక్షుడు వై.రాంగోపాల్ రెడ్డి, బహుమతి ప్రదానం చేశారు.ఈ కార్యక్రమంలో సోషల్ ఫోరం టీచర్స్ రవి,అంజయ్య, గపూర్, విష్ణువర్ధన్‌రెడ్డి పాల్గొన్నారు.

పంట పొలాలను పరిశీలించిన శాస్త్రవేత్తలు



నవతెలంగాణ -నంగునూరు

నంగునూరు మండలం వెంకటాపూర్, కోనాయిపల్లి, తిమ్మాయిపల్లి, నర్మెట్ట, మైసంపల్లి గ్రామాల్లో వ్యవసాయ శాఖ, తోర్నాల పరిశోధన స్థానం శాస్త్రవేత్తల ఆధ్వర్యంలో వరి పంట పొలాలను గురువారం పరిశీలించారు. వరిలో మొగిపురుగు నివారణ చర్యల గురించి వ్యవసాయ పరిశోధన స్థానం తొర్నాల నుంచి డాక్టర్ రమాదేవి రైతులకు తగు సలహాలు సూచనలు చెప్పారు. ఈ కార్యక్రమాల్లో ఆయా గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు, మాజీ ప్రజాప్రతినిధులు, మండల వ్యవసాయ అధికారి గీత, వ్యవసాయ విస్తరణ అధికారులు ప్రేమ్ సాగర్, మీరాబాయి, గ్రామ రైతులు పాల్గొన్నారు.

పదో తరగతి విద్యార్థులపై ప్రత్యేక దృష్టి

- శత శాతాని సాధించేందుకు ప్రయత్నం







నవతెలంగాణ- గజ్వేల్: పదవ తరగతి పరీక్ష ఫలితాల్లో శత శాతం సాధించేందుకు ప్రభుత్వ పాఠశాలలో మండల విద్యాధికారులు, ప్రధానోపాధ్యాయులు ఉపాధ్యాయులు ప్రత్యేక దృష్టి పెట్టారు. విద్యార్థిని విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తూ పలు సూచనలు సలహాలు ఇస్తున్నారు. పదో తరగతి పరీక్షల్లో మంచి ఫలితాలు సాధించేందుకు విద్యార్థులు తల్లిదండ్రులు కూడా ప్రోత్సహిస్తున్నారు. గజ్వేల్ మండలంలో జిల్లా పరిషత్ పాఠశాల 21 వరకు ఉండగా ఇందులో 964 మంది విద్యార్థులు పదో తరగతి చదువుతున్నారు. 2023 -24 కాను పరీక్ష ఫలితాల్లో విద్యార్థులు అందరినీ ఉత్తీర్ణత చేసేందుకు ప్రతి ఉపాధ్యాయుడు ప్రయత్నం చేస్తున్నారు. గత సంవత్సరం 1035/1069 అంటే 97% విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా విద్యాభ్యాసాన్ని అందిస్తున్నారు. గత ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలలో పెద్ద ఎత్తున మౌలిక సదుపాయాలు పూర్తిస్థాయిలో ఏర్పాటు చేసింది. మా ఊరు మనబడి అనే కార్యక్రమం చేపట్టి పాఠశాలలో మౌలిక సదుపాయాలకు పెద్దపీట వేసింది. గత సంవత్సరం మంచి ఫలితాలు సాధించిందని చెప్పాలి. అదేవిధంగా మండల విద్యాధికారి సునీత నిత్యం పాఠశాలలను సందర్శిస్తూ విద్యాభ్యాసాన్ని పరిశీలిస్తుంది. పదవ తరగతి బోర్డ్ పరీక్షలు అయినందున విద్యార్థులకు ఉదయం, సాయంత్రం తరగతులు నిర్వహిస్తూ ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నారు. దాంతో గత సంవత్సరం 97% విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. అన్ని పాఠశాలలో సబ్జెక్టులకు అనుగుణంగా ఉపాధ్యాయులు ఉండటం తో విద్యార్థులకు మంచి విద్యాబోధన అందుతుందని చెప్పాలి. గజ్వేల్ మండలంలో జిల్లా పరిషత్ పాఠశాలలో 290 ఉపాధ్యాయులు పనిచేస్తున్నారు. మార్చి 18 నుండి మార్చి 30 వరకు పరీక్షలు నిర్వహిస్తుండగా కొన్ని మండలాల్లో ఒకేషనల్ కోర్స్ ఉన్నచోట ఏప్రిల్ 2 తారీకు వరకు పదో తరగతి పరీక్షలు నిర్వహించనున్నారు. దీని దృష్టిలో పెట్టుకొని ప్రభుత్వ పాఠశాలలో మెరుగైన విద్యను అందిస్తున్నారు. ఉదయం, సాయంత్రం ప్రతిరోజు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తూ అదేవిధంగా విద్యార్థులు మెరుగుపరిచేందుకు పకడ్బందీ చర్యలు తీసుకుంటున్నారు. అదేవిధంగా ప్రభుత్వ పాఠశాలలో ఉదయం బ్రేక్ఫాస్ట్ తో పాటు మధ్యాహ్న భోజనం అందిస్తున్నారు. విద్యార్థుల తల్లిదండ్రులకు సైతం ఉపాధ్యాయులు సమాచారం ఇస్తూ సకాలంలో పాఠశాలలు పంపాలని పరీక్షలు సమయం దగ్గర పడుతున్నందున ఇంటి వద్ద కూడా ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని మండల విద్యాధికారులు ప్రధానోపాధ్యాయుల ద్వారా ఇంటింటికి సమాచారం అప్పుతున్నారు. పదో తరగతి తరగతులు బోధిస్తున్న ఉపాధ్యాయులు అందరూ విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారు. సబ్జెక్టుల వారిగా విద్యార్థులకు సూచనలు సలహాలు ఇస్తూ మంచి మార్కులు తెచ్చుకోవాలని అర్థమయ్యేలా బోధన చేస్తున్నారు. మండలంలో కొన్ని పాఠశాలలో స్థానికంగా ఉన్న ప్రజా ప్రతినిధులు స్వచ్ఛంద సంస్థలు ప్రత్యేక దృష్టి పెట్టి అభివృద్ధికి కృషి చేస్తున్న సందర్భాలు ఉన్నాయి. విద్యార్థులకు ఎక్కడైనా సౌకర్యాలు లేకపోతే కల్పించేందుకు ముందుకు వస్తున్నారు. తమ గ్రామంలో 10వ తరగతి పరీక్షలో మంచి ఫలితాలు రావాలని స్థానికులు కోరుకోవడం చాలా చోట్ల కనిపిస్తుంది. విద్యను ప్రోత్సహిస్తున్నారని చెప్పాలి.

కేసీఆర్ ప్రమాణస్వీకారానికి హాజరైన గజ్వేల్ నేతలు





నవతెలంగాణ -గజ్వేల్

గజ్వేల్ శాసనసభ్యులుగా కేసీఆర్ ప్రమాణ స్వీకారం కార్యక్రమానికి గురువారం గజ్వేల్ నియోజకవర్గం చెందిన నాయకులు, ప్రజాప్రతినిధులు హాజరయ్యారు. ఇందులో భాగంగానే మెదక్ ఎమ్మెల్సీ డాక్టర్ యాదవ రెడ్డి, గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ చైర్మన్ నేతి చిన్న రాజమౌళి హాజరై పుష్పగుచ్ఛమిచ్చి ఆయనకు అభినందనలు తెలిపారు.

క్యాంపస్ సెలక్షన్ ఎంపికైన విద్యార్థులకు సన్మానం



నవతెలంగాణ-నంగునూరు: నంగునూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో క్యాంపస్ ఇంటర్వ్యూలో ఎంపికైన విద్యార్థులను గురువారం సన్మానించారు. నంగునూరు ప్రభుత్వ జూనియర్ కళాశాల చెందిన నలుగురు ఇంటర్ సెకండియర్ విద్యార్థులు నందిని, అక్షయ, అజయ్, సాదుల్లా క్యాంపస్ సెలక్షన్‌కు ఎంపికయ్యారు. విద్యార్థులను ప్రిన్సిపాల్ కిషన్, సహా అధ్యాపకులు జ్యోతి, భీమ్ రావు, భరత్, కవిత, స్వామి గౌడ్, శ్రీలత, సి. హెచ్ దేవయ్య చారి, అశోక్, బాల్ లింగం, రేవంత్, నాన్ టీచింగ్ స్టాఫ్ కృష్ణారెడ్డి, కరుణ కుమారి విద్యార్థులను కళాశాలలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ కిషన్ మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో కష్టపడి చదివితే మునుమందు ఇట్లాంటి అవకాశాలు వస్తాయని తెలిపారు. పరిసర ప్రాంతంలోని విద్యార్థులను ఈ కళాశాలలో చేర్పించి అందరూ మంచి భవిష్యత్తు నిర్మించుకోవాలని సూచించారు.

కేంద్ర బడ్జెట్‌లో ఉపాధి హామీకి పెరగని నిధులు

- పెట్టుబడిదారుల కోసమే ఈ బడ్జెట్
- ఎంపీ ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని ప్రవేశపెట్టిన బడ్జెట్
- డీబీఎఫ్ జాతీయ కార్యదర్శి పి.శంకర్



నవతెలంగాణ-గజ్వేల్ : కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో ఉపాధి హామీ పథకానికి నిధులను పెంచలేదని, 2024-25కి కేటాయించిన బడ్జెట్ నిరాశాజనకంగా ఉందని దళిత బహుజన ఫ్రంట్ జాతీయ కార్యదర్శి పి.శంకర్ అన్నారు. కేంద్ర బడ్జెట్ ప్రవేశపెట్టిన సందర్భంగా గురువారం స్థానిక విలేకరులతో ఆయన మాట్లాడుతూ వివిధ సాంకేతిక జోక్యాల కారణంగా గత సంవత్సరం కూలీలు ఎదుర్కొన్న సవాళ్లను పరిగణనలోకి తీసుకోలేదన్నారు. నిధుల కొరత వల్ల ఉపాధి హామీ పథకంపై ఆధారపడిన పెద్ద సంఖ్యలో ఉన్న గ్రామీణ ప్రజల సంక్షేమాన్ని దెబ్బతీయడమే కాకుండా చట్టం ద్వారా హామీ ఇవ్వబడిన వారి జీవించే హక్కును కూడా ఉల్లంఘిస్తుందన్నారు. బడ్జెట్ అంచనా వేసిన సంవత్సరాంతపు బకాయిలను తీసివేసిన తర్వాత 40 రోజుల కంటే తక్కువ పనికి సరిపోతుందన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ మాటల గారడిగా ఎన్నికల బడ్జెట్‌గా ఉన్నదని విమర్శించారు. ఇది ప్రజల బడ్జెట్ కాదన్నారు. పెట్టుబడి దారుల కోసమే ఈ బడ్జెట్ అన్నారు.

గ్రామ అభివృద్ధి కృషి

- ధర్మారం సర్పంచ్ ఊట్ల రవీందర్ రెడ్డి



నవతెలంగాణ-మద్దూరు

ధర్మారం ప్రజలు సర్పంచ్‌గా గెలిపించినందుకు గ్రామ అభివృద్ధికి కృషి చేశానని ఊట్ల రవీందర్‌రెడ్డి అన్నారు. గురువారం ధర్మారంలో పంచాయతీ కార్యదర్శి అశోక్, సర్పంచ్, ఉప సర్పంచ్, పాలకవర్గ సభ్యులకు అభినందన సన్మాన సభ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ గ్రామ ప్రజల ఆశీర్వాదంతో సర్పంచ్ గా గెలిచానని అన్నారు. గ్రామ అభివృద్ధి కోసం తన వంతు కృషి చేశానని తెలిపారు. గ్రామపంచాయతీ నిధులు తక్కువ ఉన్న మాజీ మంత్రి హరీష్ రావు, ఎంపీటీసీ సమ్మయ్య మంజూరు చేసిన నిధులతో గ్రామంలో సీసీరోడ్లు, అండర్ డ్రైనేజీలు నిర్మించినట్లు తెలిపారు. తన ఐదేళ్ల పాలనలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూశానని తెలిపారు. ప్రజాసేవకే తాను అంకితం అయినట్లు తెలిపారు. అనంతరం ఎంపీటీసీ గుజ్జుక సమ్మయ్య, పంచాయతీ కార్యదర్శి అశోక్, గ్రామస్తులు, సర్పంచ్, ఉపసర్పంచ్, పాలకవర్గ సభ్యులను శాలువాలతో ఘనంగా సన్మానం చేశారు.

గ్రామ పంచాయతీకి సీఎం ఫొటో అందజేత



నవతెలంగాణ-మర్కుక్

మండల పరిధిలోని ఇప్పగూడెం గ్రామంలో గ్రామ పంచాయతీకి సీఎం రేవంత్ రెడ్డి ఫోటోను గ్రామ కాంగ్రెస్ పార్టీ మర్కుక్ మండలాధ్యక్షులు తాండ కనకయ్య గౌడ్, నాయకులు మంద నాగిరెడ్డి, మోయిన్, హన్మంత రెడ్డిలు గురువారం గ్రామ పంచాయతీ కార్యదర్శి రాజశేఖర్ రెడ్డికి అందజేశారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ మంద బాల్ రెడ్డి,గ్రామ సర్పంచ్ చాడ ప్రసన్న సుధాకర్ రెడ్డి, వార్డు సభ్యులు, అంగన్‌వాడీ టిచర్ నాగలక్ష్మి, ఆశావర్కర్ వెంకటమ్మ, వివోఏ హరిక, తదితరులున్నారు.

రాజిరెడ్డిపల్లి చెరువులో ఉన్న గుంత చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలి

- ప్రమాదాలను నివారించాలి
- సిద్దిపేట జిల్లా సీపీఐ(ఎం) కార్యదర్శివర్గ సభ్యులు సందబోయిన ఎల్లయ్య



నవతెలంగాణ- గజ్వేల్: 'రాజిరెడ్డిపల్లి చెరువులో ఉన్న గుంత చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలి. ప్రమాదాలను నివారించాలి' అని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు సందబోయిన ఎల్లయ్య అన్నారు. సీపీఐ(ఎం) మండల కమిటీ ఆధ్వర్యంలో గురువారం గజ్వేల్ ఐఓసీలో గల ఇరిగేషన్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత రెండు నెలల కాలంలో సుమారు ఐదు మంది మృతి చెందినట్లు తెలిపారు. గజ్వేల్ పార్క్ రోడ్డు నుంచి రాజిరెడ్డిపల్లి చెరువు కట్టమీద నుంచి రోడ్డు ఉందన్నారు. నిత్యం ఈ రోడ్డు మీద గజ్వేల్ పట్టణవాసులతో పాటు రాజిరెడ్డిపల్లి ప్రజలు రాకపోకలు సాగిస్తున్నారని తెలిపారు. మిషన్ కాకతీయలో భాగంగా చెరువులో మట్టి మెట్లకు దగ్గరగా సుమారు పది మీటర్ల లోతు ఒకే దగ్గర తీయడంతో ప్రమాదకరంగా మారిందన్నారు. నీళ్ల ఎక్కువగా ఉన్నప్పుడు పేదలు స్నానాలు చేయడం, బట్టలు ఉతకడం లాంటి పనులు చేస్తున్నారని తెలిపారు. ప్రజల ప్రాణాలకు ప్రమాదం ఉన్న ఈ గుంత చుట్టూ వెంటనే ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో సీపీఐ(ఎం) నాయకులు ఎండి అహ్మద్ అఫ్జల్ రాజు సైబస్ అమీర్ పాల్గొన్నారు.

అబద్దాల హామీలతో గద్దెనెక్కిన కాంగ్రెస్





నవతెలంగాణ- గజ్వేల్

అబద్దాల హామీలతో కాంగ్రెస్ గద్దెనెక్కిందని, మాజీ సీఎం కేసీఆర్ ప్రభుత్వ హయాంలోనే గ్రామాల అభివృద్ధి సాధ్యపడిందని రాష్ట్ర అటవీ అభివృద్ధి సంస్థ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్ రెడ్డి పేర్కొన్నారు. సర్పంచులు, ఉపసర్పంచుల పదవి కాలం ముగింపు సందర్భంగా గురువారం మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ దాసరి అమరావతి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సన్మాన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్రజలకు హామీ ఇచ్చి కాంగ్రెస్ చేతులు దులుపుకుందని ఇప్పటివరకు పెన్షన్లు వెయ్యలేదని, రైతుబంధు పూర్తిస్థాయిలో పంపలేదని వెయ్యలేదన్నారు. మిగతా గ్యారెంటీ లపై కాంగ్రెస్ ప్రభుత్వం చేతులెత్తేసింది అన్నారు. గ్రామాల ఆర్థిక పరిపుష్టికి కృషిచేసిన కేసిఆర్ పేదల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోతారని స్పష్టం చేశారు. ముఖ్యంగా అభివృద్ధికి చిరునామగా నిలిచిన గ్రామాలలో పంచాయతీ భవన నిర్మాణాలు, సిసి రోడ్లు, మురికి కాలువల నిర్మాణం, పల్లె ప్రకృతి వనాలు , డంపింగ్ యార్డులు, పాఠశాలల నిర్మాణం తదితర అభివృద్ధి పనులు కండ్లకు కనిపిస్తున్నట్లు తెలిపారు. అంతేకాకుండా సర్పంచులు సొంత నిధులతో గ్రామాలను అభివృద్ధి చేయగా, ఎప్పుడు ఎన్నికలు జరిగినా వారిని తిరిగి గెలిపించుకుంటామని అన్నారు. గజ్వేల్ నియోజకవర్గ అభివృద్ధి కేసీఆర్ తోనే సాధ్యపడిందని, అన్ని ప్రాంతాలను సమాన దృష్టితో చూసిన ఆయన నియోజకవర్గాన్ని రాష్ట్రంలోనే ఆదర్శంగా తీర్చిదిద్దినట్లు చెప్పారు. విద్యా, వైద్యం, రవాణా, పారిశ్రామిక తదితర రంగాలకు ప్రాధాన్యత ఇచ్చిన కెసిఆర్ రైల్వే లైన్ ఏర్పాటు చేశారని ఆయన అన్నారు. అదేవిధంగా యూనివర్సిటీలు, సకల వసతులతో కూడిన సమీకృత మార్కెట్ యార్డు, ప్రభుత్వ భవన సముదాయం, ఎడ్యుకేషన్ హబ్, మహతి ఆడిటోరియం తదితర ఎన్నో అభివృద్ధి పనులు చేపట్టినట్లు ఆయన చెప్పారు. ఎన్నికల సందర్భంగా వంద రోజుల్లో ఆరు గ్యారెంటీ పథకాలు అమలు చేస్తామని చెప్పిన కాంగ్రెస్ 50 రోజులు దాటుతున్నా ఆ ఊసే ఎత్తడం లేదని విమర్శించారు. సీఎం కేసీఆర్ లక్ష్యంగా విమర్శలు చేస్తూ అవినీతి జరిగిందంటూ పబ్బం గడుపుతున్నట్లు ఎద్దేవా చేశారు. ముఖ్యంగా సాగునీరు, తాగునీటికి ప్రాధాన్యత ఇచ్చిన కేసీఆర్ గజ్వేల్ ఒడిలో మల్లన్న సాగర్, కొండ పోచమ్మ ప్రాజెక్టులు నిర్మించి శాశ్వతంగా సమస్యలను పరిష్కరించిన ఘనత దక్కించుకున్నట్లు వివరించారు. అలాగే వచ్చే పార్లమెంటు ఎన్నికల్లో చేసిన అభివృద్ధిని చూపించి ప్రజలను ఓట్లు అభ్యర్థించాలని ఆయన అన్నారు. రాష్ట్ర ప్రజలు కేసీఆర్ కు అండగా నిలుస్తారని ఆకాంక్షించారు. కార్యక్రమంలో సిద్దిపేట జిల్లా చైర్ పర్సన్ రోజా రాధాకృష్ణ శర్మ,ఎంపీపీ అమరావతి, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ మాదాసు శ్రీనివాస్, మాజీ ఆత్మ కమిటీ చైర్మన్ ఊడెం కృష్ణారెడ్డి, వైస్ ఎంపీపీ కృష్ణ గౌడ్, ఎంపీటీసీల పురం మండల అధ్యక్షుడు ఆంజనేయులు, ఎంపిటిసి అశోక్, మండలంలోని సర్పంచులు ఉపసర్పంచులు నాయకులు తదితరులున్నారు.

సీఐని కలిసిన సీపీఎం బృందం



నవతెలంగాణ-చేర్యాల

చేర్యాల సీఐ గా ఇటీవల బాధ్యతలు చేపట్టిన ఎల్. శ్రీను ను మండల కేంద్రంలోని పోలీస్ సర్కిల్ కార్యాలయంలో సిపిఐ(ఎం) బృందం నాయకులు గురువారం మర్యాదపూర్వకంగా కలిసి శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. అనంతరం స్వీట్లు తినిపించారు.సీఐని కలిసిన వారిలో సిపిఐ(ఎం) సిద్దిపేట జిల్లా కార్యదర్శి ఆముదాల మల్లారెడ్డి చేర్యాల, కొమురవెల్లి మండలాల కార్యదర్శులు కొంగరి వెంకట మావో, శెట్టిపల్లి సత్తిరెడ్డి,రాంసాగర్ సర్పంచ్ తాడూరు రవీందర్, బండ కింది అరుణ్ కుమార్, ముస్త్యాల ప్రభాకర్ ఉన్నారు.

నేడు జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పరిరక్షణ సదస్సు

- డీబీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి బ్యాగరి వేణు



నవతెలంగాణ -మర్కుక్

హైదరాబాద్ సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఈ నెల 2వ తేదీన జరిగే జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పరిరక్షణ సదస్సు కరపత్రాలను మండల పరిధిలోని పాతూరు గ్రామంలో ఉపాధి హమి కూలీలతో గురువారం దళిత బహుజన ఫ్రంట్ జిల్లా ప్రధాన కార్యదర్శి బ్యాగరి వేణు విడుదల చేశారు. సదస్సును జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా బ్యాగరి వేణు మాట్లాడుతూ ఉపాధి హమీ చట్టంలో కేంద్ర ప్రభుత్వం మొబైల్ మానిటరింగ్ సిస్టమ్ (ఎమ్ ఎమ్ ఎస్),ఆధార్ బేసిడ్ వేతనాలు ఇవ్వాలనే నిబంధనల వలన కూలీలు ఉపాధి పట్ల అనాసక్తత కలిగేవిధంగా ప్రభుత్వాలు నెట్టివేస్తున్నారు.ఈ పరిస్థితులపై ఫిబ్రవరి 2వ దళిత బహుజన ఫ్రంట్ (డిబిఎఫ్) ఆద్వర్యంలో హైదరాబాదు లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రం లో జాతీయ గ్రామీణ ఉపాధి హమి పరిరక్షణ రాష్ట్ర సదస్సుకు జరుగుతుందన్నారు. ముఖ్య అతిథులుగా రాష్ట్ర పంచాయత్ రాజ్,గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క ,రిటైర్డ్ ఐఏఎస్ ఆఫీసర్ టి.గోపాల్ రావు ,ఆకునూరి మురళి రిటైర్డ్ ఐఏఎస్ ఉపాధి హామీ పథకం మాజీ డైరెక్టర్, కోదండరాం ప్రొఫెసర్ ఎమ్మెల్సీ,మానవ హక్కుల వేదిక జాతీయ సమన్వయ కర్త జీవన్ కుమార్ ,డిబిఎఫ్ జాతీయ కార్యదర్శి పి.శంకర్ లు హజరుతున్నరన్నారు. ఉపాధి కూలీలు,గృహ కార్మికులు,ర్యాక్ పిక్లర్స్,అసంఘటిత కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని తమ,తమ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తెవాలని విజ్ఞప్తి చేశారు.

బల్మూరి వెంకట్‌కు శుభాకాంక్షలు



నవతెలంగాణ-సిద్దిపేట

శాసనమండలిలో ఎమ్మెల్సీగా ప్రమాణస్వీకారం చేసిన విద్యార్థి ఉద్యమ నాయకుడు, విద్యార్థుల ఆశాజ్యోతి, ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర అధ్యక్షులు బల్మూరి వెంకట్ ని గురువారం మర్యాదపూర్వకంగా కలిసి, శుభాకాంక్షలు తెలిపినట్లు ఎన్ ఎస్ యు ఐ రాష్ట్ర కోఆర్డినేటర్ దాసరి రాజు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు కొండలవాడి సతీష్, బడేకోల్ రాకేష్ యాదవ్, పిల్లి మహేష్, గ్యార రఘుపతి, చేకిల్ల తరుణ్ గౌడ్, మొగిలి రాకేష్, సంపత్, రాకేష్ రెడ్డి, జనార్ధన్, రాము, ఎల్లం తదితరులు పాల్గొన్నారు.

విద్యా వైజ్ఞానిక మహాసభలు విజయవంతం చేయాలి



నవతెలంగాణ-సంగునూరు

ఖమ్మంలో జరిగే రాష్ట్ర ద్వితీయ విద్యా వైజ్ఞానిక మహాసభలను విజయవంతం చేయాలని టీపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎస్. కనకయ్య పిలుపు నిచ్చారు. గురువారం నంగునూరు మండలం నర్మెట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మండల విద్యాధికారి తగిరెడ్డి దేశిరెడ్డితో కలిసి విద్యా వైజ్ఞానిక గోడపత్రికను ఆవిష్కరించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 11,12 తేదీలలో జరిగే ద్వితీయ రాష్ట్ర విద్య వైజ్ఞానిక మహాసభలకు రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు తదితరులు హాజరవుతారని చెప్పారు. విద్యా వైజ్ఞానిక మహాసభలకు హాజరై విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు శ్రీనివాస్, ఉపేందర్ రెడ్డి, సత్యనారాయణ, గణపతి, శివయ్య, నరేందర్, జనార్దన్ రెడ్డి, మన్మోహన్ రెడ్డి, రాజకుమార్, లలిత, గోవర్ధన్, శిల్ప, చంద్రకళ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగ అవకాశం వ్యక్తిత్వ వికాసంపై అవగాహన



నవతెలంగాణ-ప్రజ్ఞాపూర్

ఉద్యోగ అవకాశాలు వ్యక్తిత్వ వికాసంపై ప్రతి ఒక్కరూ ప్రొఫెసర్ ఉజ్జల్ ముఖర్జీ అన్నారు. గురువారం ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో ఉద్యోగ అవకాశాలు, వ్యక్తిత్వ వికాసం అనే అంశంపై డిగ్రీ, పీజీ విద్యార్థినులకు వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిభకు, నైపుణ్యానికి తేడాను అందరికీ వివరించారు. ప్రస్తుత కాలానికి అనుగుణంగా ఉద్యోగ అవకాశాలలో నైపుణ్యం ఏ విధంగా సాధించాలి, భవిష్యత్ ప్రణాళికను ఏ విధంగా మలచుకోవాలి అనే విషయాలను వెల్లడించారు. ఏ ఉద్యోగం, ఏ రంగంలో అయినా ఇష్టపడి పూర్తి పరిజ్ఞానంతో చేయాలని సూచించారు. కార్యక్రమానికి కళాశాల ప్రధానాచార్యులు ఆచార్య పి.వి. ఉమాశశి అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపల్, టి.యస్.కె.సి. కో- ఆర్డినేటర్ డాక్టర్ జె. ఉమారాణి, ఐ.క్యూ.ఎ.సి. కో- ఆర్డినేటర్ డాక్టర్ పి. సౌజన్య, టి.యస్.కె.సి. మెంటార్ సందీప్, అన్వర్, అధ్యాపక బృందం, విద్యార్థినులు తదితరులు పాల్గొన్నారు.

సీసీరోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం



నవతెలంగాణ-చేర్యాల

చేర్యాల మున్సిపాలిటీ పరిధిలోని 8వ వార్డు దుర్గమ్మ దేవాలయం వద్ద సీడీపీ నిధులు రూ.10 లక్షలతో నిర్మించే సీసీ రోడ్డు పనులను గురువారం ఆ వార్డు కౌన్సిలర్ ఉడుముల ఇన్నమ్మ-భాస్కర్‌రెడ్డి తో కలిసి చైర్ పర్సన్ అంకుగారి స్వరూప ప్రారంభించారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ నిమ్మ రాజీవ్ కుమార్ రెడ్డి,కమిషనర్ జి.రాజేంద్ర కుమార్,వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ పుర్మ వెంకట్ రెడ్డి, మాజీ ఎంపీపీ మేడి శెట్టి శ్రీధర్, కౌన్సిలర్లు మంగోలు చంటి,ఆడెపు నరేందర్, యాట కనకవ్వ, పచ్చిమడ్ల సతీష్ గౌడ్,ఏ ఈ శ్రీకాంత్, మేనేజర్ ప్రభాకర్,వార్డు ప్రజలు పాల్గొన్నారు.

మున్సిపల్ సిబ్బందికి సరుకులు అందజేత



నవతెలంగాణ-చేర్యాల:

చేర్యాల పట్టణ కేంద్రంలోని మున్సిపల్ కార్యాలయంలో గురువారం వాటర్ సప్లై, హరితహారం, శానిటేషన్ సిబ్బందికి సబ్బులు, నూనె అంద జేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ అంకుగారి స్వరూప, వైస్ చైర్మన్ నిమ్మ రాజీవ్ రెడ్డి, కమిషనర్ జి.రాజేంద్ర కుమార్, కౌన్సిలర్లు మంగోలు చంటి, ఆడెపు నరేందర్, సందుల సురేష్, పచ్చిమడ్ల సతీష్ గౌడ్ పాల్గొన్నారు

పశువులమాంసం విక్రయాలపై చర్యలు చేపట్టాలి



నవతెలంగాణ-బెజ్జంకి: అనుమతుల్లేకుండా పశువులను వధిస్తూ వాటి మాంసాన్ని విక్రయిస్తున్న వారిపై అధికారులు ప్రత్యేక దృష్టిసారించి చట్టపరమైన చర్యలు చేపట్టాలని కోరుతూ గురువారం మండల కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద హిందూధర్మ రక్షణ సమితి సభ్యులు అందోళన చేశారు. సంబంధిత అధికారులు అలసత్వం వహిస్తే ధర్మ రక్షణ సమితి అధ్వర్యంలో అందోళన ఉదృతం చేస్తామని సభ్యులు హెచ్చరించారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
మెదక్, సంగారెడ్డి, సిద్దిపేట
శుక్రవారం | 02 ఫిబ్రవరి 2024 | www.navatelangana.com

ప్రజా సేవలో సర్పంచ్‌ల కృషి ఎనలేనిది

- హుస్నాబాద్‌లో సర్పంచ్‌లకు సన్మానం
- హుస్నాబాద్ ఎంపీపీ లకావత్ మానస



నవతెలంగాణ-హుస్నాబాద్ రూరల్

సర్పంచ్‌లు ఐదు సంవత్సరాల పదవి కాలంలో గ్రామాలలో ప్రజలకు చేసిన సేవలు ఎనలేనిదని హుస్నాబాద్ ఎంపీపీ లకావత్ మానస కొనియాడారు. గురువారం ముస్తాబాద్ మండల పరిషత్ కార్యాలయంలో సర్పంచుల ఐదు సంవత్సరాల పదవీ కాలం పూర్తయినందున పదవీ విరమణ సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీఓ సత్యనారాయణ, సర్పంచుల ఫోరం మండల అధ్యక్షుడు గంగం మదన్ మోహన్ రెడ్డి, సర్పంచులు తోడేటి రమేష్, బత్తుల మల్లయ్య, బత్తిని సాయిలు, వంగ విజయలక్ష్మి, దుంద్రా భారతి, బత్తుల సునీత, తరాల లత, లావుడియా స్వరూప, పోలవేణి లత, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

నూతన యాదవ సంఘ కార్యవర్గ ఎన్నికలు



నవతెలంగాణ-బెజ్జంకి

మండల కేంద్రంతో పాటు గుగ్గీల్ల గ్రామంలో నూతన యాదవ సంఘ కార్యవర్గ సభ్యుల ఎన్నికలు గురువారం నిర్వహించారు. బెజ్జంకి శ్రీకృష్ణ యాదవ సంఘ గ్రామాధ్యక్షుడిగా సంగ రాజమల్లు,ఉపాధ్యక్షుడిగా ఇస్కిల్ల ఐలయ్య,కార్యవర్గ సభ్యులుగా జెల్లా ప్రభాకర్, రొడ్డ మల్లేశం, బోనాల లింగయ్య, మొగిలి రమేశ్, దొంతరవేణి ఎల్లయ్య, బండి లచ్చయ్య, కల్లూరీ బాలమల్లు, కాగిత కనకయ్య ఏకగ్రీవ ఎన్నికయ్యారు. గుగ్గీల్ల శ్రీకృష్ణ యాదవ సంఘ గ్రామాధ్యక్షుడిగా కుంభం తిరుపతి, ఉపాధ్యక్షుడిగా దుగ్యాని ఎల్లయ్య, కార్యవర్గ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతన కార్యవర్గ సభ్యులను యాదవ సంఘ నాయకులు శాలువ కప్పి సన్మానించారు. అయా గ్రామాల యాదవ కులస్తులు హజరయ్యారు.

మహిళల అభివృద్ధికి కాంగ్రెస్ పార్టీ కృషి

- జిల్లా మహిళా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు ముద్దం లక్ష్మి



నవతెలంగాణ-సిద్దిపేట

మహిళల అభివృద్ధికి కాంగ్రెస్ పార్టీ అనేక సంక్షేమ పథకాలు తీసుకువచ్చిందని, కాంగ్రెస్ పార్టీ పాలనలోనే మహిళల అభివృద్ధి సాధ్యమవుతుందని జిల్లా మహిళా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు ముద్దం లక్ష్మి అన్నారు. గురువారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో జిల్లా మహిళ కాంగ్రెస్ ఉపాధ్యాక్షురాలుగా తౌడ బోయిన రేణుకకు నియామక పత్రాన్ని ఆమె అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రముఖ న్యాయవాదిగా, అనేక ఉద్యమాలలో పాల్గొని ఎన్నో సేవా కార్యక్రమాలు చేపట్మాన్నారు. కాంగ్రెస్ పార్టీలో వారి సేవలను గుర్తించి సిద్దిపేట జిల్లా ఉపాధ్యాక్షురాలుగా నియమించామన్నారు. మహిళలకు సంబంధించిన న్యాయపరమైన అంశాలను రేణుక పరిష్కరించే విధంగా కృషి చేస్తుందని తెలిపారు. అదేవిధంగా సిద్ధిపేట బ్లాక్ మహిళ కాంగ్రెస్ అధ్యక్షురాలిగా బండి మమతను నియమించామని తెలిపారు. సిద్ధిపేట జిల్లా మహిళా కో ఆర్డినేటర్‌గా ఎండి సోని, కొండపాక మండలం కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలిగా లీలారెడ్డి, తొగుట మండల మహిళ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలిగా కొంపల్లి సంగీతలను నియమించామని తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ నాయకులు దరిపల్లి చంద్రం, దాస అంజయ్య, బంక చిరంజీవి, చేవెళ్ల రంగారెడ్డి, నాయకురాలు జ్యోతి రెడ్డి, ఏల్లవ్వ జీజని బేగం, ఎర్ర స్వప్న, సుమలత, జ్యోతి, చింత లక్ష్మి లీలారెడ్డి, మోహన్ రెడ్డి, బిక్షపతి, మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

16న జరిగే దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయండి

- ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి కిష్టపురం లక్ష్మణ్
- ఎఐటియుసి ఆధ్వర్యంలో సమ్మె కరపత్రాలు విడుదల



నవతెలంగాణ-సిద్దిపేట అర్బన్

కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్పొరేట్ మద్దతు విధానాలకు నిరసనగా ఈ నెల 16న జరిగే దేశవ్యాప్త కార్మికుల సమ్మెను జయప్రదం చేయాలని ఏఐటియుసి సిద్దిపేట జిల్లా ప్రధాన కార్యదర్శి కిష్టపురం లక్ష్మణ్ కార్మిక వర్గాన్ని కోరారు. గురువారం సిద్దిపేట జిల్లా కేంద్రంలోని ఎడ్ల గురువారెడ్డి భవన్‌లో సమ్మెకు సంబంధించిన కరపత్రాలను సంఘం నాయకులతో కలిసి ఆయన ఆవిష్కరించారు. అనంతరం ఎఐటియుసి జిల్లా ఉపాధ్యక్షులు పిట్ల మల్లేశం అధ్యక్షతన జరిగిన సమావేశంలో లక్ష్మణ్ మాట్లాడుతూ కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి పది సంవత్సరాలు పూర్తయిన కార్మిక వర్గ ప్రజల సమస్యలను పరిష్కరించలేదని ఆరోపించారు. అనేక త్యాగాలతో పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలను రద్దుచేసి వాటి స్థానంలో నాలుగు లేబర్ కోడ్లను తెచ్చిందన్నారు. పిఎఫ్ ఈఎస్ఐ వెల్ఫేర్ బోర్డులను నిర్వీర్యం చేస్తున్నదని, ఎనిమిది గంటల పని దినాన్ని నిర్వీర్యం చేసి 12 గంటల పని విధానం అమల్లోకి తెస్తున్నదన్నారు. కాంట్రాక్ట్ లేబర్ విధానం అన్ని రంగాల్లో పెంచి శ్రమ దోపిడీకి గురిచేస్తుందని కనీస వేతనం రూ.26వేలు అమలు చేయాలన్నారు. నరేంద్ర మోడీ తీసుకువచ్చిన కార్మిక వ్యతిరేక విధానాల వల్ల కార్మిక వర్గం మధ్యతరగతి ప్రజల జీవితాలు రోడ్డున పడుతున్నాయని, ప్రభుత్వ రంగ సంస్థలను కార్పొరేట్ పరం చేస్తున్నదని మండిపడ్డారు. కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను తిప్పికొట్టేందుకు ఈ నెల 16న జరిగే దేశవ్యాప్త కార్మికుల సమ్మెను జిల్లాలోని అన్ని రంగాల కార్మికులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు ఆది రంగారెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు అందే అశోక్, పిట్ల మల్లేశం, జిల్లా సహాయ కార్యదర్శి బిక్కంటి సంపత్, కర్ణాల చంద్రం, తవుసుపల్లి బిక్షపతి, కోశాధికారి గోవిందారం నరసింహులు, దీకొండ శ్రీనివాస్, బత్తిని అంజా గౌడ్, చెక్కల ఐలయ్య, కొరిమి మురళి, గంగి రాజు, కొత్తూరి శ్రీనివాస్, చింతమడక రాజు, జీల లింగం తదితరులు పాల్గొన్నారు.

రైతుల ఐక్యతతోనే సమస్యల పరిష్కారం



నవతెలంగాణ-కొండపాక

రైతులు సంఘటితమై పోరాటం చేస్తేనే రైతుల సమస్యలు పరిష్కరించుకోవచ్చని భారతీయ కిసాన్ సంఘ్ సంఘటన మంత్రి రాము తెలిపారు. కొండపాక మండలం అంకిరెడ్డిపల్లి బందారం గ్రామలలో భారతీయ కిసాన్ సంఘ్ రైతుల సభ్యత్వ నమోదు కార్యక్రమంలో పాల్గొని సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రైతుల సమస్యలను పరిష్కారం కొరకు సంఘటితమై పోరాటం చేయాలని రైతులు విద్యుత్, ఇతర సమస్యలపై తమ దృష్టికి తీసుకు వస్తే సకాలంలో వారి పరిష్కార మార్గం పొందవచ్చన్నారు. అదేవిధంగా మూడు గ్రామాల్లో ప్రధాన సమస్యలైన తపాస్పల్లి రిజర్వాయర్ ద్వారా కాలువ నీళ్లు అందించుటకు పోరాటం చేస్తామన్నారు. ఈ ప్రాంతంలోని రైతులకు గత ఎండాకాలంలో వడగండ్ల ద్వారా నష్టపోయిన రైతులకు నష్టపరిహారాన్ని త్వరలోనే అందించుటకు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు జస్వంత్ రెడ్డి గౌరవ అధ్యక్షులు దుర్గ రెడ్డి,రెవెన్యూ ప్రముఖ్ గూడ మహేందర్ రెడ్డి, లా ప్రముఖ్ శ్రీనివాస్, కమిరెడ్డీ శ్రీనివాస్ రెడ్డి, మహిళ ప్రముఖ్ నిర్మలా రెడ్డి,మాజీ సర్పంచ్ బడే కోల్ నరసింహులు, ఉపసర్పంచ్ నరసింహారావు, బడేకొల్ రమేష్ యాదవ్ రాఘవరావు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధికి సర్పంచ్‌ల కృషి అమోఘం

- జిల్లా జడ్పీ చైర్ పర్సన్ వేలేటి రోజా శర్మ



నవతెలంగాణ-చేర్యాల

గ్రామాల అభివృద్ధికి సర్పంచులు చేసిన కృషి అమోఘమని జెడ్పి చైర్ పర్సన్ వేలేటి రోజా శర్మ అన్నారు. చేర్యాల మండల కేంద్రంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో ఎంపీపీ ఉల్లంపల్లి కర్ణాకర్ అధ్యక్షతన మండల సర్పంచుల వీడ్కోలు ఆత్మీయ సమావేశం గురువారం నిర్వహించారు. సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన రోజా శర్మ మాట్లాడుతూ కేసీఆర్ నాయకత్వంలో అనేక పథకాలు ప్రజలకు చేరవేసి ప్రజల మన్ననలు పొందారని తెలిపారు. దేశంలో ఎక్కడా లేనివిధంగా గ్రామస్థాయిలో సర్పంచులు వివిధ అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహించి ప్రజల ఆదరాభిమానాలు పొందారని తెలిపారు. పదవీకాలం పూర్తి అయిందనే ఆలోచన చేయకుండా నిరంతరం ప్రజా సేవలో ఉండాలని కోరారు. అంతకుముందు మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. మండలంలో తమ హయాంలో పూర్తయిన వివిధ భవనాలు నేటికీ ప్రారంభించకపోవడంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, వాటిని వెంటనే ప్రారంభించాలని మాజీ సర్పంచులు కోరారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ జోగినిపల్లి రాజేశ్వర్ రావు, ఇంచార్జి ఎంపిడివో ఎండీ. మహబూబ్ అలీ, పీఏసీఎస్ చైర్మన్ వంగ చంద్రారెడ్డి, ఏఎం సీ చైర్మన్ మల్లేశం, ఎంపీటీసీ ల ఫోరం మండల అధ్యక్షుడు గూడూరు బాలరాజు, మాజీ సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షుడు పెడతల ఎల్లారెడ్డి, మాజీ సర్పంచ్‌లు, పలువురు ఎంపీటీసీలు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధియే లక్ష్యంగా ముందుకు వెళ్తున్నాం

- డీసీసీ అధ్యక్షులు తూంకుంట నర్సారెడ్డి



నవతెలంగాణ-వర్గల్

ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ ఇచ్చిన హామీలు , గ్యారెంటీ పథకాల అమలు లక్ష్యంగా ముందుకెళ్తున్నామని జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డి పేర్కొన్నారు. గురువారం వర్గల్ మండలం తునికి కాల్సాలో మాజీ సర్పంచ్ కొండల్ రెడ్డి, మాజీ ఎంపీటీసీ శ్రీనివాస్ రెడ్డి, మాజీ ఎంపీపీ విద్యా కుమార్ ఆధ్వర్యంలో అయా పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు కాంగ్రెస్ పార్టీలో చేరిన సందర్భంగా ఆయన మాట్లాడారు. అధికారం చేపట్టిన100 రోజుల్లో వివిధ అమలు చేస్తామని హామీ ఇచ్చిన కాంగ్రెస్ ఇప్పటికే రెండు పథకాలకు శ్రీకారం చుట్టగా, మరో రెండు పథకాలు మూడు రోజుల్లో ప్రారంభించనున్నట్లు స్పష్టం చేశారు. అంతేకాకుండా నిరుద్యోగ యువతీ యువకులను దృష్టిలో పెట్టుకొని ఉద్యోగ ఉపాధి కల్పనపై దృష్టి సారించగా, రాష్ట్ర ఖజానాను గత ప్రభుత్వం దివాళ తీయించినప్పటికీ స్టాఫ్ నర్స్ నియామకాలను సీఎం రేవంత్ రెడ్డి ప్రతిష్టాత్మకంగా తీసుకొని పూర్తి చేశారని తెలిపారు. అయితే తమ హయాంలో స్టాఫ్ నర్సుల ఎంపిక ప్రక్రియ పూర్తి చేసినట్లు మాజీ మంత్రి హరీష్ రావు మాట్లాడుతుండడం సిగ్గుచేటన్నారు. అయితే ఎందుకు నియామక పత్రాలు అందజేయలేకపోయారని నిలదీశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారం చేపట్టి 60 రోజులు దాటుతుండగా, పేద ప్రజల సంక్షేమాన్ని, వారి అభివృద్ధిని ప్రతిపక్ష నేతలు కేటీఆర్, హరీశ్ రావు, కవిత జీర్ణించుకోలేక విమర్శలు చేస్తున్నారన్నారు. గత పది సంవత్సరాల కాలంలో ప్రజాధనాన్ని కొల్లగొట్టిన బీఆర్ఎస్ నేతలు ఏ ముఖం పెట్టుకొని ప్రజల్లోకి వెళ్తున్నారని, త్వరలోనే వారి బండారాన్ని కాంగ్రెస్ బయటపెట్టి ప్రజా కోర్టులో నిలదీయనున్నట్లు తెలిపారు . అయితే వచ్చే పార్లమెంట్ ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని ప్రజలను తప్పుదోవ పట్టిస్తుండగా, విజ్ఞులైన రాష్ట్ర ప్రజలు ఇప్పటికే బుద్ధి చెప్పగా, మరోసారి గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. ఇక రాష్ట్రంలో బీఆర్ఎస్ పార్టీ కనుమరుగు కావడం ఖాయమన్నారు. వివిధ కుంభకోణాలలో చిక్కుకున్న వారికి జైలు జీవితం తప్పదన్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ ప్రచార కమిటీ చైర్మన్ నిమ్మ రంగారెడ్డి, మాజీ ఎంపీపీ మోహన్, మండల కాంగ్రెస్ అధ్యక్షులు సందీప్ రెడ్డి, జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు అంక్షారెడ్డి, మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు రాజశేఖర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పరీక్షల సమయంలో వార్డెన్లు విద్యార్థులకు అందుబాటులో ఉండాలి

- ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి జనార్ధన్



నవతెలంగాణ-సిద్దిపేట

మార్చి నెలలో విద్యార్థులకు వార్షిక పరీక్షలు ఉన్న నేపథ్యంలో సంక్షేమ హాస్టళ్లలో వార్డెన్లు హాస్టళ్లలోనే ఉండి విద్యార్థులను పరీక్షలకు సన్నద్ధం చేయాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి జేరిపోతుల జనార్ధన్ సూచించారు. ఎడ్ల గురువారెడ్డి భవన్‌లో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. విద్యార్థులను నిర్లక్ష్యం చేస్తూ అందుబాటులో లేని హాస్టల్ వార్డెన్లపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామన్నారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ సంక్షేమ హాస్టళ్లలో వార్డెన్ల పనితీరు సరిగా లేదని, విద్యార్థులకు అందుబాటులో ఉండకుండా వాళ్ళ సొంత పనుల కోసం ఉద్యోగ సమయాన్ని కేటాయిస్తున్నారని ఆరోపించారు. కొన్ని చోట్ల మెను సరిగా పాటించడం లేదని, విద్యార్థులకు సరఫరా చేసే బియ్యం పక్క దారి పడుతున్నాయన్నారు. విద్యార్థులకు అందించాల్సిన చికెన్, కోడిగుడ్లు తదితర ఆహార పదార్థాలు మెనూ ప్రకారం కాకుండా తక్కువ మోతాదులో విద్యార్థులకు పెట్టి అధిక బిల్లులు పొందుతున్నారని ఆరోపించారు. ఇప్పటికైనా విద్యార్థుల జీవితాలను దృష్టిలో ఉంచుకుని వార్డెన్ల తీరు మార్చుకోవాలని కోరారు. ఫిబ్రవరి15 నుంచి ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో సిద్దిపేట జిల్లా వ్యాప్తంగా ఉన్న సంక్షేమ హాస్టళ్లలో సందర్శిస్తామన్నారు. ఈ సమావేశంలో జిల్లా అధ్యక్షుడు సంగెం మధు, జిల్లా వర్కింగ్ అధ్యక్షుడు రామగాళ్ల నరేష్, జిల్లా ఆర్గనైజింగ్ సెక్రెటరీ చిట్యాల శేఖర్, వేల్పుల ప్రసన్న కుమార్‌లు ఉన్నారు.

మున్సిపల్ చైర్ పర్సన్‌కు అవిశ్వాసం భయం పట్టుకుంది

- కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు అత్తు ఇమామ్



నవతెలంగాణ-సిద్దిపేట

మున్సిపల్ చైర్ పర్సన్ మంజుల రాజనర్సుకి అవిశ్వాసం భయం పట్టుకుందని కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు అత్తు ఇమామ్ అన్నారు. గురువారం ఆయన మాట్లాడుతూ రెండు గ్రూపులుగా కౌన్సిలర్లు విడిపోయారన్నారు. రెండుగా విడిపోవడంతో ఒక గ్రూపు కాంగ్రెస్ పార్టీతో టచ్‌లో ఉందని, త్వరలోనే వారితో అవిశ్వాస తీర్మానాన్ని ప్రవేశ పెట్టేలా కార్యచరణ చేపడుతున్నామన్నారు. మున్సిపల్ చైర్ పర్సన్ మంజుల భర్త రాజనర్సు పెత్తనం చెలాయిస్తూ, అతనే చైర్మన్‌లాగా వ్యవహరిస్తున్నారన్నారు. సిద్దిపేట పట్టణంలో 43 మంది కౌన్సిలర్లు ఉండగా అందులో అతనికి అనుకూలంగా ఉన్న వారికే నిధులు కేటాయిస్తూ వార్డుల అభివృద్ధికి సహకరిస్తున్నారన్నారు. రెండు పడక గదులలో నిర్మాణం చేపట్టిన వారే మరమ్మతులు చేపట్టాలని డిమాండ్ చేశారు. అంతేకానీ మున్సిపల్ నిధుల నుంచి మూడు కోట్ల రూపాయలకు పైగా నిధులు ఎవరి జాగీరని కేటాయిస్తారన్నారు. అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణంలో ఓ వ్యక్తికి చెందిన స్థలం పోయిందని అబద్ధాలు వల్లిస్తూ మరోచోట అతనికి స్థలం కట్టబెట్టేలా చూడడం ధారుణమన్నారు. ఈ విషయమై ఉమ్మడి మెదక్ జిల్లా మంత్రి కొండా సురేఖ దృష్టికి తీసుకువెళ్లి మున్సిపల్ నిధులను నిర్లక్ష్యంగా వాడితే చర్యలు తీసుకునేలా ఫిర్యాదు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సిద్దిపేట యువజన పట్టణ అధ్యక్షులు గయాజుద్దీన్, ఎన్ఎస్‌యుఐ వర్కింగ్ ప్రెసిడెంట్ రాశాద్ నజ్జు, నవాజ్, మహేష్, అనిల్, రాజు తదితరులు పాల్గొన్నారు.

నంది అవార్డుకు గద్దర్ పేరు పెట్టడం హర్షణీయం



నవతెలంగాణ-గజ్వేల్: సీమాంధ్రలు ఇప్పటివరకు నంది అవార్డు పేరుమీద అవార్డులు ఇచ్చారని అదే పేరును ప్రజా యుద్ధనౌక గద్దర్ పేరు పెట్టడం గొప్ప నిర్ణయమని మండల కాంగ్రెస్ నాయకులు గజ్వేల్ మహేష్ అన్నారు. గురువారం ఆయన ఇంటిలో విలేకరులతో మాట్లాడుతూ పది సంవత్సరాలు అధికారంలో ఉన్న తెలంగాణ ప్రభుత్వానికి ఆలోచన రాలేదని, ఆ ఆలోచన సీఎం రేవంత్ రెడ్డికి రావడం అభినందనీయమన్నారు. తెలంగాణ ఉద్యమ చరిత్రలో చిరస్మరణీయంగా నిలిచిపోయిన గద్దర్ పేరిట అవార్డులను అందించడం తెలంగాణ ఉద్యమకారులను గౌరవించడమేనని పేర్కొన్నారు. గద్దర్ సొంత స్థలం గజ్వేల్ నియోజకవర్గం కావడం తమ అందరికీ ఎంతో గర్వకారణమన్నారు. గజ్వేల్‌లో మూడు సార్లు గెలిచిన మాజీ సీఎం కేసీఆర్ ఏ ఒక్కరిని, తెలంగాణ వాదిని గౌరవించలేదన్నారు.

ప్రజా ప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పని చేయాలి

- జెడ్పీ చైర్మన్ వేలేటి రోజా రాధాకృష్ణ శర్మ



నవతెలంగాణ-మద్దూరు

ప్రజా ప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పని చేస్తేనే గ్రామాలు అభివృద్ధి చెందుతాయని సిద్దిపేట జిల్లా జెడ్పీ చైర్మన్ వేలేటి రోజా రాధాకృష్ణ శర్మ అన్నారు. ఈ సందర్భంగా మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ బద్దిపడగ కృష్ణారెడ్డి అధ్యక్షతన సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పని చేస్తేనే అభివృద్ధి సాధ్యమన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ పాలనలో గ్రామాలు అభివృద్ధి చెందాయన్నారు. సర్పంచ్‌ల పదవీ కాలం ముగియడంతో వారు చేసిన సేవలను ఆమె కొనియాడారు. అనంతరం మొదటిసారి మండల పరిషత్ కార్యాలయానికి వచ్చిన జెడ్పీ చైర్మన్‌ను ఎంపీపీ బద్దిపడగ కృష్ణారెడ్డి, జెడ్పీటీసీ గిరి కొండల్ రెడ్డి, సర్పంచులు ఎంపీటీసీలు శాలువాలతో ఘనంగా సన్మానం చేశారు. అదేవిధంగా సర్పంచ్ ల పదవీకాలం ముగియడంతో ఎంపీపీ బద్దిపడగ కృష్ణారెడ్డి, జెడ్పీటీసీ కొండల్ రెడ్డి, చేర్యాల మార్కెట్ కమిటీ చైర్మన్ సుంకరి మల్లేశం, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు చెట్కూరి కమలాకర్ యాదవ్‌లు సర్పంచులను వేరువేరుగా శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్లు అనంతరెడ్డి, శ్రీనివాసరెడ్డి, ఎంపీడీవో శ్రీనివాస్, అధికారులు తదితరులు పాల్గొన్నారు

వ్యాపారస్తులు సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలి



నవతెలంగాణ-మద్దూరు

గ్రామాలలో వ్యాపారస్తులు సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని చేర్యాల సీఐ ఎల్.శ్రీను అన్నారు. ఈ సందర్భంగా మండలంలోని గాగిల్లాపూర్ గ్రామంలో సీసీ కెమెరాల ఏర్పాటు, సైబర్ నేరాలపై ఎస్సై షేక్ యూనుస్ అహ్మద్ అలీ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో ఉన్న ప్రతి వ్యాపారస్తులు సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని కోరారు. గ్రామంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవడం వల్ల నేరాలను నియంత్రించవచ్చు అని ఆయన అన్నారు. ఒక్క సీసీ కెమెరా 100 మంది పోలీసులతో సమానమని ఆయన అన్నారు.సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ మండల అధ్యక్షుడు మేక సంతోష్ కుమార్,సర్పంచ్ బొల్లు కృష్ణవేణి చంద్రమౌళి, కాంగ్రెస్ మండల నాయకులు ఇట్టబోయిన కనక చంద్రం, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

NOTICE
IN THE COURT OF THE HON'BLE PRL. DISTRICT JUDGE AT KARIMNAGAR.
I.A.No. 910 of 2023
In
U/R.A.S.No. of 2024

Between:-
Sollu Kanakamma and another
...Petitioners/Appellants/Defendants.
AND
Korvi Bhoomaiah
...Respondent/Respondent/Plaintiff.

To,
Korvi Bhoomaiah S/o. Sayabu Age: 70 years R/o. Gunukulakondapur village of Bejjanki mandal of Siddipet district.

Whereas the above named Petitioners/Appellants/defendants have filed a petition **Under Sec. 5 of Limitation Act.** against you praying before the Hon'ble Court to condoning delay of 495 days in numbering the appeal suit for contest the appeal.

Take notice that the above Case is posted on **15-02-2024** for your appearance & counter and in case of your failure to appear in person or through an Advocate on the said date **at 10:30 am** before the Hon'ble Prl. District Judge Karimnagar the matter will be heard and determined in your absence.

(By the order of the Hon'ble Court)
Sd/-
Muddasani Sampath
Advocate.
(TS/1728/2011)
H.No.2-10-982, Jyothinagar,
Karimnagar town & dist.
Mobile No.9985776258.

గంజాయి అమ్మే వారిపై ప్రత్యేక నిఘా

నవతెలంగాణ-చేర్యాల

చేర్యాల పోలీస్ సర్కిల్ పరిధిలో గంజాయి, గంజాయితో తయారు చేసిన చాక్లెట్స్ అమ్మే వారిపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసినట్లు సీఐ ఎల్.శ్రీను తెలిపారు. గంజాయిని ఇతర ప్రాంతాల నుంచి తీసుకొచ్చి పాన్ షాప్‌లు, కిరాణా షాపుల్లో అమ్ముతున్నట్లు తమ వద్ద సమాచారం ఉన్నట్లు పేర్కొన్నారు. ఈ ప్రాంతానికి ఇతర ప్రాంతాల నుంచి వచ్చి కూలి పనులు చేసేవారిపై నిఘా ఉందని, తల్లి తండ్రులు, కళాశాల, పాఠశాలల యాజమాన్యాలు విద్యార్థుల ప్రవర్తనను ఎప్పటికప్పుడు గమనించాలని తెలిపారు.

నూతన సీఐ సైదను సన్మానించిన బీజేపీ నాయకులు



నవతెలంగాణ-గజ్వేల్

గజ్వేల్ నూతన సీఐగా బాధ్యతలు స్వీకరించిన సైదని బీజేపీ అధ్వర్యంలో మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించి స్వాగత శుభాకాంక్షలు తెలిపారు. గురువారం జరిగిన ఈ సన్మాన కార్యక్రమంలో బీజేపీ గజ్వేల్ అసెంబ్లీ కో కన్వీనర్ బండారు మహేశ్, గజ్వేల్ పట్టణ మండల అధ్యక్షులు వుప్పల మధుసూధన్, పంజాల అశోక్ గౌడ్, సీనియర్ నాయకులు సిల్వేరు జనార్ధన్, ప్రధాన కార్యదర్శి పెండ్యాల శ్రీనివాస్, బీజేపీ నాయకులు నాగు ముదిరాజ్, మైస విజయ్, మర్కంటి ఎగొండ, నాయిని సందీప్, ఆనంద సాయి గౌడ్ బెండే సతీష్ కుమార్, నాగరాజు రిక్కీ గౌడ్ శరత్ రాజు తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

నవతెలంగాణ-సిద్దిపేట

33/11కెవి లింగారెడ్డి పల్లి సబ్ స్టేషన్ మరమ్మత్తుల కోసం లింగ రెడ్డి పల్లి ఎస్ఎస్ ఏరియాలలో విద్యుత్తు అంతరాయం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు ఉంటుందని అసిస్టెంట్ డివిజనల్ ఇంజనీర్ రవీందర్ తెలిపారు. లింగారెడ్డి పల్లి, ఇంద్రమ్మ కాలనీ, ఇమామాబాద్, రేణుకా నగర్, వీజెడి కాలనీ, ఎల్లమ్మ దేవాలయం సర్కిల్‌లో విద్యుత్ అంతరాయం ఉంటుందని వినియోగదారులు అధికారులకు, సిబ్బందికి సహకరించాలని కోరారు.

ఫైర్ ప్రమాదంపై అవగాహన

- విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఫైర్ సిబ్బంది..



నవతెలంగాణ-సిద్దిపేట అర్బన్

సిద్దిపేట అర్బన్ మండలం పొన్నాల సమీపంలోని వికాస్ హై స్కూల్‌లో గురువారం విద్యార్థులకు ఫైర్ ప్రమాదం జరిగితే తీసుకునే జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఫైర్ ప్రమాదం జరిగినప్పుడు అత్యవసరంగా ఎటువంటి జాగ్రత్తలు తీసుకోవాలి, ఆ పరిస్థితులలో ఎలా వ్యవహరించాలి అనే అంశాలను ఫైర్ సేఫ్టీ సిబ్బంది విద్యార్థులకు క్షుణ్ణంగా వివరించి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ మధుమోహన్, ఫైర్ సిబ్బంది, పాఠశాల ఉపాధ్యాయులు రవి తదితరులు పాల్గొన్నారు.

మద్దూరు స్పెషల్ అధికారిగా ఎంపీడీవో బాధ్యతల స్వీకరణ



నవతెలంగాణ-మద్దూరు

మద్దూరు మండల కేంద్రంలోని గ్రామపంచాయతీ స్పెషల్ అధికారిగా ఎంపీడీవో శ్రీనివాస్ గౌడ్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీఓ కాజా మొయినుద్దీన్, తాజా మాజీ సర్పంచ్ జనార్దన్ రెడ్డి, పంచాయతీ కార్యదర్శి గద్ద వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

పీఆర్‌టీయూ డైరీని ఆవిష్కరించిన అడిషనల్ కలెక్టర్



నవతెలంగాణ-సిద్దిపేట

పీఆర్‌టీయూ సిద్దిపేట జిల్లా శాఖ డైరిని గురువారం అదనపు కలెక్టర్ గరిమా అగర్వాల్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పిఆర్టియు సిద్దిపేట జిల్లా శాఖ అధ్యక్షులు ఆదరాసుపల్లి శశిధర్ శర్మ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలను అందరం కలిసి అభివృద్ధి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి మల్లు గారి ఇంద్రసేనారెడ్డి, బెజ్జంకి మండల శాఖ అధ్యక్షులు బొల్లం శ్రీనివాస్, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు రజనీకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా నాభిశీల బొడ్రాయి మారు పండుగ



నవతెలంగాణ-నంగునూరు

నంగునూరు మండలం తిమ్మాయిపల్లి గ్రామంలో బొడ్రాయి మారు పండుగ వేడుకలను ఘనంగా నిర్వహించారు. గ్రామస్తులందరూ మొదటగా పోచమ్మకు బోనాలు సమర్పించారు. అనంతరం నాభిశీల బొడ్రాయికి గ్రామ ఆడపడుచులు డప్పు చప్పుళ్లతో, భక్తిశ్రద్ధలతో బొడ్రాయికి జలాభిషేకం చేశారు. అనంతరం నాభి శిల బొడ్రాయికి బోనాలు సమర్పించి భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. గ్రామ సర్పంచ్, బొడ్రాయి కమిటీ నిర్వాహకులు మాట్లాడుతూ గ్రామ ప్రజలు సుభిక్షంగా ఉండాలని పాడిపంటలతో ఆయారోగ్యాలతో ఉండాలని పోచమ్మ బొడ్రాయికి బోనాలను సమర్పించారు. ఈ కార్యక్రమంలో కుల సంఘాల నాయకులు, ప్రజా ప్రతినిధులు, గ్రామ మహిళలు, బొడ్రాయి కమిటీ నిర్వాహకులు పాల్గొన్నారు

మర్పడగ పాఠశాలను తనిఖీ చేసిన డీఈఓ



నవతెలంగాణ-కొండపాక

కొండపాక మండలం మర్పడగ ఉన్నత పాఠశాలను సిద్దిపేట జిల్లా డీఈఓ శ్రీనివాసరెడ్డి గురువారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పదో తరగతి విద్యార్థుల సామర్థ్యాలను ఆయన పరిశీలించారు. రికార్డులను, మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి ఉపాధ్యాయులతో మాట్లాడారు. అయోధ్యలో శ్రీరాముని ప్రాణ ప్రతిష్ఠ రోజు గ్రామంలో జరిగిన ఉత్సవాల్లో విద్యార్థులు పాల్గొన్నారని విద్యార్థి సంఘాలు ఫిర్యాదు చేయడంతో, ఈ అంశంపై డిఈఓ విచారణ జరిపారు.

వేతన జీవులను నిరాశపర్చిన కేంద్ర బడ్జెట్



నవతెలంగాణ-తొగుట

కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో నూతనంగా ఒక్క వెసలుబాటు కల్పించలేదని, వేతన జీవులను పూర్తిగా నిరాశపర్చిందని పీఆర్టీయూ మండల అధ్యక్షులు పుల్లగూర్ల రామచంద్రారెడ్డి, ప్రధాన కార్యదర్శి లచ్చుగారి కనుకారెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. గురువారం వారు మాట్లాడుతూ కొత్త పన్నుల విధానంలో 80సి, 80డి, ఇంటి అద్దె, విద్య, గృహ రుణాలపై వడ్డీ తదితర మినహాయింపులు వర్తింపుజేయాలని డిమాం డ్ చేశారు. మూడేళ్లుగా సంఘాలు కోరుతున్నా పట్టించుకోకపోవడం అన్యాయమని అన్నారు. బడ్జెట్ ప్రతిపాదనలకు సవరణలు చేసి, పన్నుల భారం తగ్గించి ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్లకు కాస్తయినా ఉపశమనం కలిగించాలని కోరారు. ప్రత్యక్ష పన్ను మినహాయింపు పరిమితిని రూ.10 లక్షలకు పెంచాలని అన్నారు.